J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74

నెల్లూరు, 14.02.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 37 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



• గాంధీజీ కలల అమలుకు శ్రీకారం

# గ్రామ స్వరాజ్యం సాకారం

- సంస్కరణల బాటతో ముందడుగు
- స్థానిక సంస్థలపై సరికొత్త నిర్ణయాలు
- రాష్ట్ర ప్రభుత్వం సంచలన మార్గం
- స్థానిక ఎన్నికల్లో స్థానికతకే ప్రాధాన్యం
- అవినీతి, మద్యం, ధనం నియంత్రణ దిశగా ముందడుగు

గ్రామస్వరాజ్యం... మహాత్ముడి స్వప్నం! గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు... గ్రామ రాజ్యమే రామరాజ్యం... గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది.. ఇవన్నీ ఇప్పటి వరకు మనం చదువుకున్నవే... నాయకుల ప్రసంగాలలో విన్నవే! కాని వాటి ఆచరణ దిశగా బలమైన అడుగులు ఎప్పుడూ పడలేదు.

దేశ చరిత్రలోనే ఒక గొప్ప అధ్యాయానికి శ్రీకారం చుడుతూ... స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే కాదు, నీతి, నిజాయితీలతో కూడిన పాలన అందించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముందడుగు వేశాడు. స్థానిక సంస్థల ఎన్నికలలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాడు. స్థానిక సంస్థల ఎన్నికల వ్యవస్థలో పేరుకుపోయిన కుళ్ళును కడిగేలా ప్రక్షాళనకు నడుం కట్టాడు. స్థానిక ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని అరికట్టే దిశగా బలమైన ప్రయత్నం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ సంస్కరణలు చేపడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది.

### అర్హులకు అందలం దక్కేలా!

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు గ్రామాల పట్ల సేవాభిలాష కలిగి, నిజాయితీతో పని చేయాలనుకున్నవారికి ఒక మంచి అవకాశమనే చెప్పాలి. ఇప్పటిదాకా స్థానిక ఎన్నికలంటే ఏంటి? ఒక మేజర్ పంచాయితీ సర్పంచ్ పదవికి పోటీ చేయాలంటే కనీసం కోటి రూపాయలు సొంతంగా ఖర్చు పెట్టుకోగలగాలి. పంచాయితీ వార్డు మెంబర్‌కు సైతం 5 నుండి 10లక్షలు ఖర్చు, ఒక చిన్న పంచాయితీ సర్పంచ్‌కు కూడా పాతిక నుండి 50 లక్షల దాకా ఖర్చు. జడ్పీటీసీ పదవుల పోటీలో (మిగతా 10వ పేజీలో)



నాకు మీరు...

# మీకు నేను!

• వైసిపి - బీజేపీ స్నేహగీతం

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఢిల్లీ... కేవలం రెండోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చాక 8 నెలల కాలంలోనే బీజేపీ అధికారం కోల్పోయిన రాష్ట్రాలు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలలో ఎక్కువ దెబ్బలు తగులుతుండడం ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారుతోంది. ప్రధానిగా నరేంద్ర మోడీ ఇమేజ్ రెండు ఎన్నికల్లో పని చేసింది, అదే ఇమేజ్‌ను కొనసాగించడం కష్టం. కాబట్టి వీలైనన్ని ఎక్కువ ప్రాంతీయ పార్టీలను కలుపుకోవాలి. ఇప్పుడు చూస్తే ఎన్డీఏలో కంటే కూడా వ్యతిరేక కూటమి లోనే ఎక్కువ ప్రాంతీయ పార్టీలున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు తెలుగు దేశం, మహారాష్ట్రలో ఎన్నికల (మిగతా 10వ పేజీలో)




# దాడులతో దడదడ!

- ఏబి వెంకటేశ్వరరావు చుట్టూ బిగిసిన ఉచ్చు
- తనను కాపాడకుంటే మిమ్మల్ని ఇరికిస్తానంటూ 'దేశం' నేతలకు హెచ్చరికలు
- ఏసిబి దాడులతో బయటపడుతున్న అక్రమాల పుట్టలు



వైయస్ జగన్మోహన్‌రెడ్డి... ప్రతిపక్ష నాయకుడిగా తన 8 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో దాడులకు గురయ్యాడు. అప్పట్లో కేంద్రంలో చక్రం తిప్పిన సోనియా గాంధీ మొదలుకొని రాష్ట్రంలో కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు, సిబిఐ, ఇ.డి, మీడియా... దేశ రాజకీయ చరిత్రలో ఇంతటి మూకుమ్మడి దాడి ఏ నాయకుడి మీద కూడా జరిగి వుండదు. అన్నింటినీ ఆయన తట్టుకుని ఎదురొడ్డి నిలిచాడే కాని ఏరోజూ వెన్ను చూపలేదు.

ఇప్పుడాయన రాష్ట్ర ముఖ్యమంత్రి.... అప్పట్లో ఆయన చట్టాలను అధిగమించి తనపై దాడులను చేసినా ఓర్చుకున్నాడు. ఇప్పుడు చట్టబద్ధమైన మార్గంలోనే చంద్రబాబుకు, ఆయన బృందానికి (మిగతా 10వ పేజీలో)

## గ్రామాల్లో..
# మొదలైన 'స్థానిక' సందడి!



**జిల్లాలో స్థానిక ఎన్నికల జ్వరం మళ్ళీ మొదలైంది. స్థానిక రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేతో ఇప్పటికే ఎన్నికల నిర్వహణ ఒక నెల ఆలస్యమైంది. మార్చి 15వ తేదీలోగా స్థానిక ఎన్నికల ప్రక్రియనంతా పూర్తి చేయాలని 12వ తేదీ నిర్వహించిన మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకోవడం తెలిసిందే! స్థానిక సంస్థల రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు ఎలా వచ్చినా, దాని ప్రకారంగా ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.**

అయితే స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త నిబంధనలు, కఠినతరంగా మారుస్తున్న చట్టాలు మాత్రం కొందరు నాయకులలో కలవరం పుట్టిస్తున్నాయి. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ఒక మేయర్, ఏడుగురు మున్సిపల్ ఛైర్మన్లు, ఒక జడ్పీ ఛైర్మన్, 46 మంది జడ్పీటీసీలు, 583 మంది ఎంపీటీసీలు, 940 మంది దాకా పంచాయితీ సర్పంచ్‌లు ఎన్నిక కాబోతున్నారు. వీళ్ళు కాకుండా కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పంచాయితీ వార్డు మెంబర్లు కలిపితే 9వేల మందిదాకా వుంటారు. స్థానిక సంస్థల ఎన్నికలంటేనే ఒక జాతర. ఈ జాతర కోసం జిల్లా అధికార యంత్రాంగం నెల్రకితమే సిద్ధమైంది. ఎన్నికల సామాగ్రినంతా నెల్రకితమే ఆయా మండల కేంద్రాలకు తరలించేశారు. బ్యాలెట్ పత్రాలను ప్రింటింగ్ కూడా చేయిస్తూ, ఎన్నికలపై హైకోర్టు స్టే ఇవ్వడంవల్ల మధ్యలో ఆపేశారు. అధికార యంత్రాంగమంతా కూడా ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగానే ఉంది. పంచాయితీలు, జడ్పీటీసీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల అభ్యర్థులు ఎక్కడ ఎవరెవరన్నది దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అధికారపార్టీలో టిక్కెట్లకు పోటీ గట్టిగా ఉంది.

# ఊరు ఉరిమింది

## బీదపై దురాయి... సొంతూరికి ఇక పరాయి

**ఏ ఊరైతే ఆయనను హీరోగా చూసిందో, ఏ ఊరి ప్రజలైతే ఆయన వస్తుంటే ఆయన పాదాల క్రింద పూలు చల్లారో... అదే ఊరు ఇప్పుడు ఆయనపై కన్నెర్ర చేసింది. ఆ ఊరి వాళ్లెవరూ ఆయనతో మాట్లాడకూడదంటూ దురాయి విధించింది. ఆ ఊరు అల్లూరు మండలం ఇస్కపల్లి మజరా ఇస్కపల్లిపాలెం కాగా, ఆ బహిష్కరణకు గురైన నాయకుడు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కావడం గమనార్హం.**



ఇటీవల ఇస్కపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు శివాలయం పునఃప్రారంభ ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలకు ఆ గ్రామస్తుడిగా బీద రవిచంద్ర కూడా హాజరయ్యాడు. అయితే సందర్భం ఎలా వచ్చిందో ఏమోగాని బీద రవిచంద్ర ఇంత దరిద్రపు ఊరు ఎక్కడా వుండదంటూ ఒకటికి రెండుసార్లు నోరుజారాడు. రాజకీయాలలో ఖర్చులు ఎక్కువయ్యాక నాయకుల నోటి నుండి తరచూ ఇలాంటి మాటలే వస్తుంటాయి. ఒక్క రవిచంద్రే కాదు, చాలామంది నాయకులు ఇలా మాట్లాడుతుంటారు, అయితే వాళ్ళు ముఖ్యుల వద్ద అనేవాళ్ళు. రవిచంద్ర బయటకు అనడం ఆయన మెడకు చుట్టుకుంది. ఊరినే తిట్టడంతో ఇస్కపల్లిపాలెం గ్రామస్తులు ఆయనపై ఆగ్రహించడమే కాక, ఆయనతో గ్రామస్థులు మాట్లాడకూడదని, నేరుగా మాట్లాడితే 10వేలు, ఫోన్‌లో మాట్లాడితే 3వేలు జరిమానా కట్టాలని దురాయి విధించారు.

సమాజంలో మంచి ఊరు, చెడ్డ ఊర్లు ఉండవు. అక్కడ నివసించే ప్రజల స్వభావాలలో మంచి, చెడులుంటాయంతే! ఎన్నో ఎన్నికల్లో వేరే పార్టీకి ఓట్లేయకుండా తెలుగుదేశంకే ఓట్లేసేలా ఈ గ్రామస్థులు దురాయి వేయడంలో బీద రవిచంద్ర ప్రధానపాత్ర పోషించాడు. ఇప్పుడు అదే 'దురాయి' కట్టుబాటు ఆయనను కూడా వదల్లేదు. అంతా విధి రాత!

# పెద్దాసుపత్రిలో కలెక్టర్ తనిఖీలు



నెల్లూరు దర్గామిట్టలోని ప్రభుత్వాసుపత్రిని ఈనెల 12వ తేదీ రాత్రి జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు డాక్టర్లను, రోగులను సమస్యలపై ఆరాతీసారు. గతంలో కలెక్టర్ తనిఖీ చేసినపుడు పురిటి బిడ్డల వార్డులో ఏసీలు పనిచేయకపోవడం, కిటికీలు, ర్యాపర్లు మరమ్మత్తులకు గురై వుండడాన్ని గమనించిన ఆయన నిధులను మంజూరు చేసి వాటిని సరిచేయాలని కోరివున్నారు. తనిఖీల సందర్భంగా అవి ఎంత మేర మరమ్మత్తులు చేశారో పరిశీలించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాధాకృష్ణరాజు మాట్లాడుతూ 16 మంది ఉండాల్సిన పీడియాట్రిక్, గైనకాలజీ విభాగాల్లో నలుగురు డాక్టర్లే పనిచేస్తున్నారని తెలిపారు. కొన్ని పోస్టులు ఖాళీగా వున్నాయని, మరికొంతమంది డాక్టర్లు డిప్యుటేషన్ పై వెళ్ళారని తెలిపారు. దీంతో కలెక్టర్ ప్రిన్సిపల్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ డాక్టర్ల కొరత వుంటే డిప్యుటేషన్‌పై ఎలా పంపుతారని అడిగారు. ఇప్పటి వరకు జరిగిన డిప్యుటేషన్లను రద్దు చేయిస్తానన్నారు. ఇక్కడి మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరించాలని మునిసిపల్ శాఖ ఎస్ఇ ఇమాముద్దీన్‌ను ఆదేశించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాంబశివరావు, డిప్యూటి సూపరింటెండెంట్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

## 18 నుంచి
# మూడో దశ 'కంటివెలుగు'

జిల్లాలో 3వ దశ కంటివెలుగు కార్యక్రమాన్ని ఈనెల 18 నుంచి నిర్వహించనున్నామని జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ మంజులమ్మ చెప్పారు. ఈనెల 11న ఆమె నెల్లూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 60 ఏళ్ళు నిండినవారికి డయాబెటిక్ రెటినోపతి, గ్లకోమా, ఐఓఎల్ తదితర అన్ని రకాల నేత్రపరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. అవసరమైనవారికి ఉచిత ఆపరేషన్లతో పాటు కంటి అద్దాలు కూడా ఉచితంగా ఇస్తామన్నారు. మోదరన్ ఐ ఆసుపత్రి, నారాయణ, జయభారత్, ఎల్వీప్రసాద్ ట్రస్ట్, షిరిడి సాయి ట్రస్ట్ నేత్రవైద్య నిపుణులు ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నారని ఆమె తెలిపారు. జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన మండలాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, పిఓడిటి డాక్టర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

## రాష్ట్ర మంత్రి అనిల్‌కుమార్ యాదవ్

నెల్లూరు నగరం మూలాపేటలో స్వయంభువుగా వెలసియున్న శ్రీ భువనేశ్వరీ సమేత శ్రీ మూలాస్థానేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈనెల 16 నుండి 28వతేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ సూచించారు. ఈనెల 13 న దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21 వ తేదీన జరిగే మహాశివరాత్రి రోజున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానం సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మునిసిపల్ శాఖ వారు శానిటేషన్, మంచినీరు తదితర ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ శాఖ వారు విద్యుత్తుకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. అదే విధంగా ఈనెల 23 న జరిగే రథోత్సవం కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. రథోత్సవం నిర్వహించే ప్రధాన రోడ్ల పరిస్థితిని మునిసిపల్ శాఖ అధికారులు ముందుగా పర్యవేక్షించాలని సూచించారు. దారికి అడ్డంగా వున్న విద్యుత్ వైర్లు, డిష్ వైర్లను తొలగించాలని ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వుండాలని కోరారు. 13 రోజులపాటు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ధర్మకర్తల మండలి సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వైయస్సార్ సీపి నాయకులు పి.రూప్‌కుమార్‌యాదవ్, ఆలయ ఇఒ ఎ.వేణుగోపాల్, ధర్మకర్తల మండలి ఛైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి



వంట వార్పు కార్యక్రమంలో పాల్గొన్న కోడూరు కల్పలత

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 3 రాజధానుల విధానానికి మద్దతుగా గత వారం రోజులుగా జరుగుతున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం గూడూరు టవర్ క్లాక్ సెంటర్‌లో వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. 'ఒక రాజధాని వద్దు – 3 రాజధానులు ముద్దు', 'గ్రాఫిక్స్ మాకొద్దు – అభివృద్ధి మాకు ముద్దు' అనే నినాదంతో నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమం జరిగింది. మున్సిపల్ మాజీఛైర్మన్, వైయస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి కోడూరు కల్పలత, వైసిపి నాయకులు కోడూరు మీరారెడ్డి, రాజారెడ్డి, సతీష్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, సుభాను తదితర వైసిపి నాయకులు పాల్గొన్నారు.



# డాక్టర్ జయప్రద నవల ఆవిష్కరణ

నెల్లూరుకు చెందిన ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద రచించిన 'శివాని' నవల ఇటీవల ఆవిష్కరణ జరిగింది. నెల్లూరు, ఐఎంఎ హాలులో 1961 బ్యాచ్ మెడికల్ స్టూడెంట్స్(ఇప్పుడు రిటైర్డ్ డాక్టర్స్) సమక్షంలో డాక్టర్ గోవర్ధన్ చేతులమీదుగా ఈ నవల ఆవిష్కరణోత్సవం ఘనంగా జరిగింది.

# హ్యూమన్ రైట్స్ మిషన్ ఇండియా జిల్లా కార్యవర్గం

కుల మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా హ్యూమన్ రైట్స్ మిషన్ ఇండియా పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు పి.వెంకయ్య పేర్కొన్నారు. నెల్లూరులోని అంబేద్కర్ భవన్‌లో సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఈనెల8న ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జి.ప్రకాశం, పి.దిలీప్‌కుమార్, డి.రమణయ్య, కె.నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా వై.వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా షేక్ జావీద్ సలాం, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు

## - టి.వసంతలక్ష్మి



కేంద్ర ప్రభుత్వ ఎమ్మెస్మెఈ మంత్రిత్వ శాఖ సహకారంతో ఈనెల 14 నుండి 16వతేదీ వరకు నెల్లూరు కస్తూరిదేవి పాఠశాల ఆవరణంలోని డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో మహిళా పారిశ్రామికవేత్తల సదస్సును నిర్వహిస్తున్నట్లు వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ టి.వసంతలక్ష్మి తెలిపారు. నెల్లూరు పొగతోటలోని ట్రస్ట్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ వీ ఇండియా, వీఎల్సీటీ అండ్ ఆర్సీ ప్రభుత్వ సహకారంతో సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ, పట్టణ స్థాయిలో వున్న మహిళా వ్యాపారవేత్తలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేయాలనే ఉద్దేశ్యంతో సదస్సును ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి మేకపాటి గౌతంరెడ్డి, ఏపీఐఐసీ ఛైర్మన్ రోజాతో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొంటారని వివరించారు. ప్రతినిధిగా పాల్గొనే వారు తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9000114422, 9393979749 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### మొగళ్ళపాలెం క్రీడా అకాడమీ..

# ఎప్పుడు పూర్తవుతుంది?

**- రాజ్యసభలో ప్రశ్నించిన విపిఆర్**



నెల్లూరుజిల్లాలోని మొగళ్ళపాలెం వద్ద చేపట్టిన బహుళార్థ సాధక ఇండోర్ ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ నెల 10, 11 తేదీలలో రాజ్యసభలో జరిగిన చర్చల్లో ఆయన మాట్లాడుతూ ఈ స్టేడియం నిర్మాణానికి 8కోట్లు మంజూరు చేయగా, కేవలం 2కోట్లు మాత్రమే ఇంతవరకు విడుదల చేశారని, అసలు ఈ స్టేడియం స్థితిని తెలియజేయాలని ఆయన కోరారు. దీనికి కేంద్రమంత్రి కిరెన్‌రిజుజు సమాధానమిస్తూ ఏపి స్పోర్ట్స్ అథారిటీ సమర్పించిన నివేదిక ప్రకారం ఈ ప్రాజెక్ట్ 70శాతం పురోగతి సాధించిందని, 2020 మార్చి నాటికి ఇది పూర్తయ్యే అవకాశముందని పేర్కొన్నారు. అలాగే 2020 నాటికి 10వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్‌కు ఏ విధమైన సహాయం అందించబోతున్నారని విపిఆర్ సభలో ప్రశ్నించారు. దీనికి కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌కె సింగ్ సమాధానమిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో 4160 మెగావాట్ల సామర్థ్యంగల 5సౌర ఉద్యానవనాలను ఆమోదించడం జరిగిందని, వివిధ పథకాల ద్వారా కేంద్రం సౌరవిద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోందని చెప్పారు. అలాగే దేశంలో ఐదేళ్లలోపు పిల్లల మరణాలు, కారణాలపై కూడా విపిఆర్ ప్రశ్నించారు.

# సమస్యల పరిష్కారానికే సమీక్షలు

**- డిఆర్‌సిలో మంత్రులు**




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్

జిల్లా సమీక్షా కమిటీ సమావేశం 13వ తేదీ గురువారం నెల్లూరుజిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, అటవీ, విద్యుత్, గనుల శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్, శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి, కిలివేటి సంజీవయ్య, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వి.వరప్రసాద్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ ఆనం విజయకుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, జాయింట్ కలెక్టర్ పి.వినోద్‌కుమార్, ఇతర అధికారులు హాజరయ్యారు. జిల్లాలో ప్రజల సమస్యలు పరిష్కరించడానికే సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామని, సమావేశంలో తమ దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యతనిస్తున్నామని మంత్రులు తెలిపారు. అటవీ, మైనింగ్ శాఖల పరంగా ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి అనిల్ కోరారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజక వర్గాలలో నెలకొన్న సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు.



## వైసిపిలోకి మాజీ కార్పొరేటర్

నెల్లూరు నగరపాలక సంస్థ 15వ డివిజన్ మాజీ కార్పొరేటర్ అంచూరు జానకి, తన భర్త అంచూరు శ్రీనివాసులు నాయుడుతో కలసి ఈ నెల 13వ తేదీన జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. రోడ్లు భవనాల అతిథి గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గణేశం వెంకటేశ్వర్లురెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



కంచి స్వామిని తన స్వగృహానికి స్వాగతిస్తున్న ఎస్పీ బాలు



'లాయర్' ప్రచురించిన 'ఇదీ సాంబమూర్తి గారి కథ' పుస్తకాన్ని చూపుతున్న శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి, పక్కన ఎస్పీ బాలు

### ఆ సంగీతాలయం..

# ఇక వేదనాదాల నిలయం

**తన స్వగృహాన్ని కంచి పీఠానికి అప్పగించిన ఎస్పీ బాలు**

ప్రఖ్యాత హరికథాగాన కళాకోవిదుడు, మహాపండితుడు.. నెల్లూరును మరో తిరువాయూర్‌గా మార్చి శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను ఏళ్ళతరబడి ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన త్యాగరాజ భిక్షువు.. శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, ఆయన సతీమణి శకుంతలమ్మలు జీవనం సాగించిన గృహాన్ని.. వారి తనయుడు.. భారతీయ సినీగాయకుడు, గానగంధర్వుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం కంచికామకోటి పీఠం పర్యవేక్షణలో వేదాధ్యయానికి, సంగీతసాధనకు గాను కంచికామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జగద్గురు విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారికి అప్పగించారు. ఆమేరకు ఈనెల 11న నెల్లూరులోని తిప్పరాజువారి వీధిలో ఉన్న తమ నివాసానికి శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామీజీని సాదరంగా పూర్ణకుంభంతో స్వాగతించి తమ నివాసాన్ని అప్పగించే కార్యక్రమాన్ని బాలూ ఎంతో భక్తితో నిర్వహించారు. తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు నివసించిన ఈ సంగీతాలయం కలకాలం వేదనాదాలతో, సంగీత సౌరభాలతో పల్లవిస్తుండాలని ఆకాంక్షిస్తూ బాలూ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించు కుని శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారు తమ నివాసానికి విచ్చేయడం తన పూర్వజన్మ సుకృతమని బాలూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ తండ్రి శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి జీవితాన్ని వివరిస్తూ 'లాయర్' వారపత్రిక ప్రచురించిన 'ఇదీ సాంబమూర్తి కథ' పుస్తకాన్ని, 'హరికథా భిక్షువు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి జీవనదర్శనం' అనే మరొక పుస్తకాన్ని బాలూ శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారికి అందజేశారు.

**పండితారాధ్యుల సాంబమూర్తి ఆశయాలకు అనుగుణంగా.. వేదనాద ప్రచారం**

**- శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామీజీ**

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారు మాట్లాడుతూ వేదం విశ్వాసంగా, నాదం శ్వాసగా నెల్లూరు ఇకపై వేదనాద నిలయం కానుందని ఆశీర్వదించారు. లోకానికి మానవతా విలువలు నేర్పిన దేశం భారతదేశమని, ధర్మమే లక్ష్యంగా సర్వమానవ కల్యాణమే ధ్యేయంగా భారతదేశం ముందుకు సాగుతోందని అన్నారు. ఎస్పీబాలూ తాతగారైన శ్రీపతి పండితారాధ్యుల లింగమూర్తి, తండ్రిగారైన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి భగవత్‌భక్తితో నాదోపాసనతో శ్రీ త్యాగరాజస్వామి సంకీర్తనలతో నెల్లూరును తమ భక్తిగానాలతో సుసంపన్నం చేశారని శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి కొనియాడారు. అటు సంగీతాన్ని, ఇటు భక్తితత్వాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసిన గొప్పవ్యక్తి పండితారాధ్యుల సాంబమూర్తి అని ఆయన అంటూ, ఆయన ఆశయాలకు అనుగుణంగా ఈ ఇంటిలో వేదనాద ప్రచారాన్ని కొనసాగిస్తామన్నారు. నెల్లూరు నగర వీధుల్లో భగవన్నామ స్మరణలను, శ్రీ త్యాగరాజస్వామివారి సంకీర్తనలను గానం చేస్తూ, భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించిన ఘనత సాంబమూర్తికే దక్కుతుందన్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆ సనాతన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ సుప్రసిద్ధులయ్యారని, ఆయన గానం చేసిన లింగాష్టకం ఎంతో ప్రసిద్ధమైనదని, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు అది ఎంతో పేరు తెచ్చిందని అభినందించి ఆశీర్వదించారు. నెల్లూరులో వేద నాద పాఠశాలను త్వరలో ప్రారంభిస్తామని, ఈ వేద సంగీత పాఠశాలతో నెల్లూరుకు మరింత కీర్తి కలుగుతుందని అన్నారు.

**ఇదంతా పూర్వజన్మ సుకృతం - ఎస్పీ బాలూ**

అనంతరం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తమ తండ్రిగారు గొప్ప శైవభక్తులని, వారు ఇప్పుడు లేరనే ఆవేదన తప్ప, వారి పేరుతో ఇలా వేదపాఠశాలను నిర్వహించే కార్యక్రమం చేపట్టడం ద్వారా తమ తండ్రి ఇక్కడే ఉన్నారని భావిస్తున్నామని ఆయన ఎంతో వినమ్రంగా అన్నారు. భగవత్‌సేవకు కంచిపీఠం వారు ఈ గృహాన్ని స్వీకరించడం సంతోషకరమన్నారు. ఇదంతా తమ పూర్వజన్మ సుకృతమన్నారు.

ఈ కార్యక్రమంలో బాలూ సతీమణితో పాటు, సోదరీమణులు ఎస్పీ శైలజ, ఎస్పీ వసంత, మంత్రి ఓయస్సీ పెంచల రెడ్డి, వీరిసెట్టి హజరత్‌బాబు, భిక్షాటనా పూర్వక త్యాగరాజ ఆరాధనోత్సవ సభ కార్యదర్శి యనమండ్ర నాగదేవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## 'ప్రభా'తం


ఒక గ్రామ సర్పంచ్ ఐదేళ్లపాటు తన గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశాడు. ప్రజలు మళ్లీ కూడా ఆయన్నే సర్పంచ్‌గా గెలిపించుకుంటారు. ఒక ఎమ్మెల్యే తన నియోజకవర్గ ప్రగతి కోసం గతంలో ఎమ్మెల్యేల కంటే బాగా కృషి చేశాడు... ఆ నియోజకవర్గ ప్రజలు మళ్లీ ఆయన్నే ఎమ్మెల్యేగా నిర్ణయించుకుంటారు. ఒక ముఖ్యమంత్రి సమర్థవంతంగా పరిపాలన అందిస్తే, మళ్లీ ఆ ముఖ్యమంత్రి పాలననే కోరుకుంటారు. ఒక ప్రధాని దేశానికి ఉత్తమమైన సేవలందిస్తే, ఆ తర్వాత ఎన్నికలలోనూ దేశ ప్రజలంతా ఆయన వెనుకాలే నడుస్తారు.

దేశంలోని ప్రజలు చాలా స్పష్టతతో వున్నారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే గ్రామస్థాయి నాయకుడిని చూడాలి, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి సమర్థతను చూడాలి. దేశం బాగుండాలంటే దమ్మున్న ప్రధానిని ఎన్నుకోవాలి. ఇందులో తేడాలు లేవు. ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలన బాగుందని చెప్పి, ఆ పార్టీ మున్సిపల్ వార్డు అభ్యర్థులకు ప్రజలు ఓట్లేయరు. అలాగే గ్రామస్థాయిలో సర్పంచ్ చెప్పాడని చెప్పి లోక్‌సభలో ఓట్లేయరు. ప్రధానిగా ఎవరు కావాలి, సర్పంచ్‌గా ఎవరిని ఎన్నుకోవాలి... ఈ విషయాలలో ప్రజలు చాలా తెలివిగానే నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీనికి సాక్ష్యమే ఢిల్లీ ఎన్నికల ఫలితాలు.

ఢిల్లీ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించింది. ఈ హ్యాట్రిక్ విజయం కూడా సాధారణ మెజార్టీతో కాదు, ఐదేళ్ల క్రితం చీపురుతో స్వీప్ చేసినట్లే, ఈసారి కూడా దాదాపు అంతే పని చేసింది. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలను దాటి 'ఆప్' విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 70 స్థానాలకుగాను 62 స్థానాలను ఆప్ గెలుచుకోగా, అధికారం కోసం పోరాడిన బీజేపీ మాత్రం 8 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ మాత్రం క్రితం ఎన్నికల్లోలాగే 'జీరో' బ్యాలెన్స్‌తో సరిపెట్టుకుంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో బీజేపీకి ఐదు సీట్లు పెరగడంతో పాటు ఓటింగ్ శాతం మెరుగుపడటం ఆ పార్టీకి ఊరటనిచ్చే అంశం.

2014లో జరిగిన ఎన్నికల్లో ఢిల్లీలో హంగ్ ఫలితాలు రాగా కాంగ్రెస్ మద్దతుతో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అధికారపీఠమెక్కాడు. అయితే కాంగ్రెస్ తన సహజసిద్ధ వంకర స్వభావంతో అరవింద్ ప్రభుత్వాన్ని ఆరునెలలకే కూల్చింది. అయినా కూడా అరవింద్ కేజ్రీవాల్ పట్టువిడవకుండా పోరాడాడు. 2015లో జరిగిన ఎన్నికల్లో సర్వశక్తులూ ఒడ్డాడు. 'సామాన్యుడు' అనే ట్యాగ్ లైన్‌తో ప్రజల ముందుకు వెళ్లాడు. ఇల్లిల్లు తిరిగాడు. తన పార్టీ గుర్తు చీపురు పట్టుకుని రోడ్లు ఊడ్చాడు. విద్యావంతులను, మేధావులను, సామాన్యులను, కార్మికులను... అన్ని వర్గాలవారిని ఏకం చేశాడు. 2015 ఎన్నికల ఫలితాలలో అయితే 'ఆప్' ఒక సునామీనే సృష్టించింది. మొత్తం 70స్థానాలకు గాను 'ఆప్' 67 స్థానాలు గెలుచుకోగా బీజేపీ మూడు స్థానాలకు పరిమితం కావడం తెలిసిందే! ఎన్నికలకు ముందు చెప్పిన మాటలను అరవింద్ కేజ్రీవాల్ అధికారంలోకి వచ్చాక ఆచరణలో పెట్టాడు. పలు సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు ఢిల్లీ ప్రజల అవసరాలు తీర్చే దిశగా తన పరిపాలనను మలచుకున్నాడు. పాలనలో నిజాయితీని చూపించాడు. ఎలాంటి అక్రమాలు లేవు, అభివృద్ధి తప్ప అవినీతి లేదు. కాబట్టి ఢిల్లీ వాసులకు అరవింద్ కేజ్రీవాల్ తప్పితే రెండో ఆప్షన్ లేకుండా పోయింది. ఢిల్లీలో బీజేపీ, కాంగ్రెస్‌ల పరిస్థితి అది కాదు, ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్ స్థాయికి తగ్గ నాయకుడిని ఈ రెండు పార్టీలు కూడా చూపలేక పోయాయి. బీజేపీ అన్నా కేంద్రంలో అధికారంలో వుంది కాబట్టి, దిగువస్థాయి కేడర్ వుంది కాబట్టి కాస్త గట్టిగానే పోరాడింది. కాని కాంగ్రెస్ పరిస్థితి అలా కాదు, ఎన్నికలకు ముందే కాడ దించేసింది. అంతే కాదు, బీజేపీని గెలవనీయకూడదనే ఉద్దేశ్యంతో 'ఆప్'ను గెలిపించే దిశగా అడుగులు వేసింది. కాంగ్రెస్ నామరూపాలు కోల్పోతున్న రాష్ట్రాలలో ఢిల్లీని కూడా రాసి పెట్టుకోవచ్చు.

## తీర్పు అంటే ఇలా ఉండాలి!



ఎనిమిది నెలల క్రితం పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. ఢిల్లీలో 7 పార్లమెంటు స్థానాలకు ఆప్ - కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయి. వాళ్లకు ఒక్క సీటు రాలేదు. బీజేపీ అన్ని సీట్లూ గెలుచుకుంది. అంతమాత్రాన ఆరోజు ఢిల్లీ ప్రజలు అరవింద్ కేజ్రీవాల్‌ను తిరస్కరించినట్లు కాదు, ప్రధానిగా నరేంద్ర మోడీ వుండాలని కోరుకున్నారు కాబట్టే అప్పుడు ప్రజలు బీజేపీకి ఓట్లేశారు. ఢిల్లీ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ బెటర్ అనుకున్నారు కాబట్టే ఇప్పుడు 'ఆప్'కు 62 సీట్లిచ్చారు.

ఎనిమిది నెలల క్రితం పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. ఢిల్లీలో 7 పార్లమెంటు స్థానాలకు ఆప్ - కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయి. వాళ్లకు ఒక్క సీటు రాలేదు. బీజేపీ అన్ని సీట్లూ గెలుచుకుంది. అంతమాత్రాన ఆరోజు ఢిల్లీ ప్రజలు అరవింద్ కేజ్రీవాల్‌ను తిరస్కరించినట్లు కాదు, ప్రధానిగా నరేంద్ర మోడీ వుండాలని కోరుకున్నారు కాబట్టే అప్పుడు ప్రజలు బీజేపీకి ఓట్లేశారు. ఢిల్లీ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ బెటర్ అనుకున్నారు కాబట్టే ఇప్పుడు 'ఆప్'కు అన్ని సీట్లిచ్చారు. ప్రజల లెక్కల్లో, ప్రజల ఆలోచనలో ఎలాంటి తేడా లేదు.

ఒక ప్రభుత్వం సమర్థవంతంగా సేవలందిస్తే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని తిరిగి ఎన్నుకుంటున్నారు. దీనికెన్నో ఉదాహరణలున్నాయి. ఒరిస్సాలో నవీన్ పట్నాయక్ ఆరుసార్లు గెలిచాడు. గతంలో గుజరాత్‌లో నరేంద్రమోడీ మూడుసార్లు, పశ్చిమబెంగాల్‌లో జ్యోతిబసు పాతికేళ్లు, త్రిపురలో మాణిక్ సర్కార్, మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్, బీహార్‌లో నితీష్‌కుమార్ వంటి వారి పరిపాలనలే ఇందుకు ఉదాహరణ. ఈ కోవలోనే ఇప్పుడు ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ విజయం. ఇది నిఖార్సయిన తీర్పు. ఈ ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు 'ఆప్'ను కాకుండా ఇంకో పార్టీని గెలిపించి వుంటే మంచి పరిపాలనను బట్టి ప్రజలు ఓట్లేయరనే అపప్రద వచ్చుండేది. కాని, ఢిల్లీ ప్రజలు నిఖార్సైన తెలివైన తీర్పిచ్చారు. వాళ్ళు ఇలాంటి తీర్పు ఇవ్వబోతున్నారని ఎగ్జిట్‌పోల్స్, మీడియా సంస్థలేకాదు, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కూడా పసి గట్టారు. అందుకే ఢిల్లీ ఫలితాలపై ముందు నుండి వాళ్ళు కూడా పెద్దగా ఆశలు పెట్టుకోలేదు.

## చండీహోమాలతో సత్ఫలితాలు

**- కంచికామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి**



చండీ అమ్మవారి కరుణ ఉంటే ఎలాంటి కష్టాలైనా ఇట్టే మటుమాయమవుతాయని, చండీమాత మహిమలు అనంతమని, చండీ హోమాలు నిర్వహించడం ద్వారా మన జీవితాల్లో ఎన్నో సత్ఫలితాలను పొందవచ్చని కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు ఉద్బోధించారు. ఈనెల 9న నెల్లూరులోని మూలాపేటలో ఉన్న శంకర మఠంలో 9వ చండీహోమాన్ని స్వామీజీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ, ఎంతో మహిమాన్వితమైన చండీమాతను ఆరాధిస్తే జీవితాల్లో సుఖసంతోషాలకు లోటుండదని అన్నారు. భక్తిశ్రద్ధలతో చండీమాతను ఆరాధించడం ద్వారా భక్తులు అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావచ్చన్నారు. చండీహోమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనడం వల్ల కూడా కష్టాలు తీరిపోతాయన్నారు. శంకరమఠం మేనేజర్ కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు తమ మాటను శిరసావహించి శంకరమఠంలో 90 నెలలుగా చండీహోమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. నెల్లూరును ఆదర్శంగా తీసుకుని ప్రతి ప్రాంతంలో కూడా చండీహోమాలను నిర్వహించాలని స్వామీజీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## శ్రీరంగనాథునికి.. బంగారు గరుడసేవ

ఈనెల 9న వ్యాసపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాయకస్వామి దేవాలయంలో కన్నుల పండువగా బంగారు గరుడసేవ నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఈ వేడుకలో పాల్గొని స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో పెద్దఎత్తున విశేషపూజలు చేశారు. ఈ కార్యక్రమానికి యడవల్లి శ్రీనివాసరావు, యడవల్లి మధుసూదనరావు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తలమండలి ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, ఇ.ఓ వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు.

## కామాక్షమ్మకు కాసుల హారం

జొన్నవాడలోని శ్రీ కామాక్షితాయి అమ్మవారికి 73 గ్రాముల బంగారు కాసుల హారాన్ని బెంగుళూరుకు చెందిన గుండ్రా ప్రభాకర్‌రెడ్డి, రజని దంపతులు ఆలయ ఛైర్మన్ చీమల రమేష్‌కు ఈనెల 8న అందజేశారు. ఈ సందర్భంగా ఇ.ఓ శ్రీనివాసులరెడ్డి దాతలకు అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## చెన్నకేశవస్వామి ఆలయానికి 25 లక్షల విరాళం

నెల్లూరు జిల్లా జలదంకి గ్రామంలో వెలసియున్న చెన్నకేశవస్వామి, అమ్మవార్లకు జలదంకికి చెందిన దేవిరెడ్డి బ్రహ్మారెడ్డి, రమణమ్మ దంపతులు వారి కుమారులు మల్లిఖార్జునరెడ్డి, కామేశ్వరరెడ్డి రూ.25 లక్షలు విలువజేసే వెండి ఆభరణాలు, పొలాన్ని ఈనెల 9న వితరణ చేశారు. రూ.10 లక్షలు విలువజేసే వెండి ఆభరణాలు, రూ.15 లక్షలు విలువజేసే ఎకరా పొలాన్ని సమర్పించుకున్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేక రథంలో స్వామి, అమ్మవార్లకు అందించే వెండి వస్తువులను గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలోని ప్రధానార్చకులకు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

## శిక్షలు వెంటనే వేయాలి..




ఘోరమైన నేరాలలో నిందితులకు కోర్టులు శిక్షలైతే వేస్తున్నాయి. కాని అవి అమలు పరచడంలో కాలయాపన జరుగుతోంది. చట్టాలలోని లొసుగులను అడ్డంపెట్టుకుని నిందితులు తప్పించుకోవాలని చూస్తున్నారు. నిర్భయ నిందితుల ఉరిశిక్ష రాష్ట్రపతి క్షమాభిక్ష పిటిషన్ తిరస్కరించాక కూడా ఇంకా అమలు కాలేదు. 2012లో నెల్లూరులో జరిగిన తల్లీకూతుర్ల హత్య కేసులో ప్రధాన నిందితుడు ఇంతియాజ్‌కు ఉరిశిక్ష వేయడం హర్షణీయం. అయితే ఆ శిక్షను త్వరగా అమలు చేయాలి. లేదంటే నిందితుడు యథాప్రకారం చట్టాలలోని లొసుగులను వాడుకుని శిక్ష నుండి తప్పించుకుంటాడు.

**పి.వైశాలి, నెల్లూరు.**

## ఎన్ఆర్‌సి అమలు చేయాలి

తమ రాజకీయ స్వార్థం కోసం, ఓట్ల బ్యాంకు కోసం పలు పార్టీలు, నాయకులు ఎన్ఆర్‌సి బిల్లును వ్యతిరేకిస్తున్నారు. భారతదేశ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకున్నవాళ్లెవరూ ఈ బిల్లులను వ్యతిరేకించరు. చట్టబద్ధమార్గాలలో ఈ దేశంలోకి ఎవరైనా రావచ్చు. కాని దేశంలోకి అక్రమంగా చొరబడే వారితో పెనుప్రమాదం పొంచి వుంది. అక్రమ చొరబాటుదారుల కారణంగా పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలలో స్థానికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చొరబాటుదారులకు వాళ్ళ మతం మీద తప్పితే దేశం మీద ప్రేమ వుండదు. ఇలాంటివారికి ఆశ్రయం ఇవ్వాల్సిన పని ఎంతమాత్రం లేదు.

**ఎన్.వి.ఎస్.మూర్తి, భీమవరం.**

## బుద్ధి మారదా?

'కియా' కార్ల కంపెనీ ఆంధ్రప్రదేశ్ నుండి తరలిపోతుందంటూ తెలుగుదేశం పచ్చమీడియా ఊదరగొట్టింది. పార్లమెంటులో కూడా దీని మీద టీడీపీ ఎంపీలు రగడ చేశారు. అధికారం కోల్పోవడాన్ని పచ్చమీడియా తట్టుకోలేకపోతోంది. వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపైన దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకుంది. ఇలాంటి అభూతకల్పనలు సృష్టించడం ద్వారా ఈ పచ్చమీడియా రాష్ట్రంలో ఒక చెడు సంస్కృతిని విస్తరిస్తోంది. దీనివల్ల రాష్ట్రం ఎంత నష్టపోతుందో వాళ్లకు అర్థమవుతున్నట్లు లేదు. అర్థమైనా మా ప్రభుత్వం కాదు కాబట్టి మేమింతే అన్నట్లుగా వున్నట్లున్నారు.

**జి.కేశవరెడ్డి, నెల్లూరు.**



నెల్లూరు నగరంలో ట్రాఫిక్ అన్నది ఒక సర్కస్ లాంటిది. సర్కస్‌లో విన్యాసాలు సులభంగా చెయ్యొచ్చేమోగాని, నగరంలోని ట్రాఫిక్‌లో వాహనం నడపడం చాలా కష్టం. ఇక్కడ వున్న ట్రాఫిక్ టెర్రిఫిక్... నెల్లూరు నగరంలో వున్న ప్రధాన రహదారులు జిఎన్‌టి రోడ్, మినీబైపాస్, పొదలకూరురోడ్డు... దాదాపు 3వేల ఆర్టీసీ, ప్రైవేట్, స్కూల్ బస్సులు, పాతికవేల ఆటోలు, ఒకటిన్నర లక్ష దాకా ఇతర వాహనాలు.. ఈ రోడ్లపైనే రాకపోకలు సాగించాలి. ముఖ్యంగా ట్రంకురోడ్డులో అయితే పగలు ఏ నిముషంలో చూసినా నగరంలో ఆటో కార్మికుల ర్యాలీ ఏమన్నా జరుగుతుందా? అన్నట్లుగా ఆటోలు రాసుకుని రాసుకుని పోతుంటాయి.

## మంత్రి దృష్టిపెడితే... నగర ట్రాఫిక్‌కి పరిష్కారం దొరికినట్లే!

### • బస్టాండ్‌లను మారిస్తే ఉపశమనం

నెల్లూరులో ట్రాఫిక్ సమస్యను ఎలా పరిష్కరించాలన్నది ఒక భేతాళ ప్రశ్న! పాతికేళ్లుగా ఎంతో మంది కలెక్టర్లు, ఎస్పీలు దీనిపై పెద్ద కసరత్తే చేశారు. ఎన్నో ప్రయోగాలు చేశారు. కఠిన చర్యలు తీసుకున్నారు. ఏం లాభం? వాహనాలు పెరుగుతున్నాయని చెప్పి రోడ్లను వెడల్పు చేయలేముగా! చేసినా ఒకటి లేదా రెండుసార్లు. అంతకుమించి చేయలేరుగా? పోలీసులు నిబంధనలు అతిక్రమించి తిరుగుతున్నారని చెప్పి ఎన్ని ఫైన్‌లు వేసినా, ఎన్ని వాహనాలు సీజ్ చేసినా, బండ్లు తిరగాల్సిందైతే నెల్లూరు రోడ్ల మీదే కదా!

ఎవరెన్ని ప్రయోగాలు చేసినా నెల్లూరు రోడ్ల మీద ట్రాఫిక్ తగ్గించడం అన్నది అయ్యే పని కాదు. ఎందుకంటే... నగరంలో ఉండాల్సిన వ్యాపార, వాణిజ్య, సేవా సంస్థలన్నీ ఈ ప్రధాన రహదారులకు అనుసంధానంగానే వున్నాయి. కేవలం ఆర్టీసీ బస్టాండ్‌ను నగర శివార్లకు తరలించడం ద్వారా నగరంపై పడుతున్న ట్రాఫిక్ భారాన్ని సగం తగ్గించవచ్చని 'లాయర్' గత 20ఏళ్లుగా మొత్తుకుంటూనే వుంది. గతంలో కొందరు కలెక్టర్లు కూడా దీనికి ప్రయత్నాలు చేశారు. హైవేకు ఆనుకుని బుజబుజ నెల్లూరు ప్రాంతానికి ఆర్టీసీని తరలించే ఆలోచన చేశారు. అయితే అప్పట్లో అధికారపార్టీ నాయకులు ఈ ఆలోచనలకు గండికొట్టారు. అప్పుడే ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ తరలింపు ఆచరణలోకి వచ్చుంటే, కొత్త ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు నగరంలో ట్రాఫిక్ చాలా తగ్గి వుండేది.

ఇటీవల నగర ఎమ్మెల్యే, జల వనరుల శాఖ మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్ ట్రాఫిక్ సమస్యపై దృష్టిపెట్టడం సంతోషించదగ్గ విషయమే. ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు ఆత్మకూరు బస్టాండ్‌ను కూడా నగర శివార్లకు తరలించాలన్న ఆలోచన చేయడం మంచి పరిణామమే! జాతీయ రహదారికి ఆనుకుని విశాల ప్రాంగణంలో ఎక్కడ ఆర్టీసీ బస్టాండ్‌లు పెట్టినా కొత్త ప్రాంతాలు అభివృద్ధి కావడం, నగరంపై ట్రాఫిక్ భారం తగ్గడం జరుగుతాయి.

## దుష్టశక్తులను తరిమికొడదాం..

### - కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



లక్ష్మీనరసింహస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

రాష్ట్రాభివృద్ధి కోసం అహరహం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిపై కొన్ని దుష్టశక్తుల కళ్ళు పడ్డాయని, రాష్ట్రప్రజలు తరిమికొట్టినా మళ్ళీ వచ్చి విద్వేషాలు సృష్టించాలని, రాష్ట్రాన్ని నాశనం చేయాలని చూస్తున్నాయని, ఆ దుష్టశక్తులను పారద్రోలాలని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న అన్నారు. అలాంటి దుష్టశక్తుల చూపు ముఖ్యమంత్రిపై పడకుండా ఆయనకు మనోధైర్యాన్ని ప్రసాదించి దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపేలా చూడాలని తాము వేదగిరి లక్ష్మీనరసింహస్వామిని ప్రార్ధిస్తున్నామని ఆయన చెప్పారు. ఈనెల 9న డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి నగరోత్సవంలో ఎమ్మెల్యే ప్రసన్న పాల్గొన్నారు. సంప్రదాయంలో భాగంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవమూర్తులను నరసింహకొండ నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి నెల్లూరు నవాబుపేటలో ఉన్న జిల్లా మార్కెటింగ్ సొసైటీ రైసుమిల్లు వద్ద కొలువుదీర్చి, వేద పండితుల ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా స్వామివారికి పంచామృతాభిషేకలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్న పాల్గొని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి పూజలు నిర్వహించిన అనంతరం మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి, రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న పలు సంక్షేమపథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆప్కాఫ్ ఛైర్మెన్ కె.అనిల్, డిసిఓ కె.తిరుపాల్ రెడ్డి, వైకాపా నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, కిన్నెర మాల్యాద్రి, రఘు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపరాష్ట్రపతి సతీమణికి స్వాగతం పలికిన కలెక్టర్

భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు సతీమణి శ్రీమతి ఉషమ్మ ఈ నెల 8వ తేదీన వ్యక్తిగత పనుల నిమిత్తం చెన్నై నుండి రోడ్డు మార్గాన నెల్లూరుజిల్లాకొచ్చారు. జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరి బాబు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుని పూలబొకే ఇచ్చి ఆమెకు స్వాగతం పలికారు.

### • దేశం

## అధ్యక్ష రేస్‌లో బీద?

### • బిసిలకు ప్రాధాన్యతాక్రమంలో అవకాశం



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేస్‌లో నెల్లూరుజిల్లాకు చెందిన బీద రవిచంద్ర పేరు ఇప్పుడు హల్‌చల్ చేస్తోంది. తన రాజకీయ ప్రయాణం మొదలుపెట్టినప్పటి నుండి ఒక్కసారి కూడా పార్టీ మారకుండా, ఒక్కరోజు కూడా పార్టీని విడవకుండా, కష్టకాలంలో కూడా పార్టీని అంటిపెట్టుకున్న నాయకుడిగా రవిచంద్రకు పేరుంది. దానికి తోడు బలహీనవర్గాలకు చెందినవాడు. యువకుడు, ఉత్సాహవంతుడు కూడా అవడంతో ఆయన పేరు ప్రతిపాదనల్లో వచ్చింది.

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ, ఏపిలకు విడివిడిగా టీడీపీ అధ్యక్షులను నియమిస్తూ, జాతీయ అధ్యక్షుడిగా మాత్రం చంద్రబాబునాయుడే కొనసాగుతున్నాడు. ఆంధ్రప్రదేశ్‌కు కిమిడి కళా వెంకట్రావ్ అధ్యక్షుడుగా వున్నాడు. అయితే ఆయన పదవీకాలం ఆరేళ్ళవుతుండడంతో, యువ నాయకత్వానికి కొత్త అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలనే వాదన పార్టీలో మొదలైంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఘోరపరాజయం చవిచూడడం, ముఖ్యంగా యువత, బలహీనవర్గాలు పార్టీకి దూరం కావడం తెలిసిందే! ఈ దశలో పార్టీ కార్యవర్గాలను యువరక్తంతో నింపాలని, పార్టీ కోసం అంకితభావంతో పని చేస్తున్న వారికి అవకాశమివ్వాలనే డిమాండ్ మొదలైంది. ఈ నేపథ్యంలోనే గతంలో తెలుగుయువత రాష్ట్ర అధ్యక్ష పదవిని సమర్ధవంతంగా నిర్వర్తించిన బీద రవిచంద్ర పేరు ప్రచారంలో తెరకెక్కింది.

## అప్పుడే ఆశల ఊసులు

### • కార్పొరేటర్ సీట్లకై పోటాపోటీ



మున్సిపల్ ఎన్నికల దిశగా రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఈసారి కార్పొరేటర్లమైపోయి రాజ్యమేలాలనుకుంటున్న నాయకుల్లో ఉత్సుకత మొదలైంది. ముఖ్యంగా అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కార్పొరేటర్ల టిక్కెట్లకు గట్టిపోటీ వుండబోతోంది.

నెల్లూరు నగరపాలక సంస్థలో 54 కార్పొరేషన్ డివిజన్‌లున్నాయి. నెల్లూరు నగర నియోజకవర్గం, నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో కలిపి 54 డివిజన్‌లున్నాయి. 2014లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో వైసిపి 31 డివిజన్‌లు గెలుచుకోగా, తెలుగుదేశం 19 స్థానాలకే పరిమితమైంది. అయితే అప్పుడు వైసిపి నుండి మేయర్‌గా ఎన్నికైన అబ్దుల్ అజీజ్ తెలుగుదేశంలోకి వెళ్లడం, వైసిపి నుండి గెలిచిన కార్పొరేటర్లు కొందరు ఆయన వెంట వెళ్లడం తెలిసిందే! దీంతో ఆయా డివిజన్‌లలో వైసిపి ఇన్‌ఛార్జ్‌లుగా కొత్తవాళ్ళు బాధ్యతలు చేపట్టడం జరిగింది.

నగరపాలక సంస్థలోని 54 డివిజన్‌లలో కూడా వైసిపికి కార్పొరేటర్లు లేదా ఇన్‌ఛార్జ్‌లు వున్నారు. గతంలో గెలిచినవాళ్ళు, ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరిస్తున్నవాళ్ళు కార్పొరేటర్ టిక్కెట్లను ఆశిస్తున్నారు. వైసిపి అధికారపార్టీ కాబట్టి టిక్కెట్ వస్తే చాలు, సులభంగా గెలిచిపోతామన్న ధైర్యం వీళ్లలో వుంది. అందుకే టిక్కెట్ల కోసం బలమైన ప్రయత్నాలే చేస్తున్నారు.

పార్టీని కనిపెట్టుకుని వున్నోళ్లే కాదు, ఇటీవల కాలంలో పార్టీలో చేరినోళ్లు కూడా టిక్కెట్ల మీద ఆశతో వున్నారు. అయితే అభ్యర్థుల ఎంపికలో ఆయా డివిజన్‌ల రిజర్వేషన్‌లే ప్రధానపాత్ర పోషించే అవకాశముంది.




నెల్లూరు కబుర్లు

# అనూహ్య 'స్పందన'



సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి ప్రజలు పోటెత్తినట్లు వచ్చారు. దీనికి కారణం ఇటీవల జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో పింఛన్‌లు రద్దు చేసి, రేషన్‌కార్డులను తొలగించి వుండడమే. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుండి పెద్దసంఖ్యలో అర్జీదారులు వచ్చి పింఛన్‌లు, రేషన్‌కార్డులు, అలాగే ఇళ్ల స్థలాలకు సంబంధించి కలెక్టర్, డిఆర్‌ఓలకు అర్జీలు సమర్పించుకున్నారు.

## సచివాలయ ఉద్యోగులు
# బాధ్యతగా వ్యవహరించాలి



పొట్టేపాళెం సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జేసీ వినోద్

సచివాలయ ఉద్యోగులు బాధ్యాతాయుతంగా వ్యవహరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. ఈనెల 10న పొట్టేపాళెం సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన అక్కడ ఓ బాలికను రేషన్ కార్డు నుంచి తొలగించిన అధికారులు ఆమెకు వివాహామైనట్లు రికార్డుల్లో పొందుపరచడాన్ని గుర్తించారు. దీనిపై విచారణ చేపట్టిన జేసీ స్వయంగా ఆ బాలిక నివసించే ఇంటికి అధికారులను తీసుకుని వెళ్లారు. ఆ బాలికకు వివాహం కాలేదని గుర్తించిన జేసీ ఇలా చేయడం సరికాదని అధికారులు, ఉద్యోగులు చేసిన తప్పిదానికి బాలిక రేషన్ కార్డు నుంచి తొలగింపునకు గురైందన్నారు. వెంటనే సదరు బాలికను తిరిగి రేషన్ కార్డులో చేర్చాలని ఆదేశించారు. ఇలాంటి తప్పిదాలు మరెక్కడా జరగకూడదని, సచివాలయాల్లో ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. డీఎస్వో బాలకృష్ణ, ఎన్ఎంసి ఏడీసీ గోపి పాల్గొన్నారు.

# పెద్దోడికే పెనుభారం!

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కరెంట్ ఛార్జీలు పెంచింది. అయితే ఈ ఛార్జీలతో అతికొద్దిమందికి మాత్రమే షాక్ తగిలేలా చేసింది. నెలకు 500 యూనిట్ల వాడకం దాటిన వారిపై ఒక్కో యూనిట్‌కు 90పైసలు వంతున పెంచారు. ఇప్పటివరకు వాడకం 500 యూనిట్లు దాటితే యూనిట్‌కు 9.95పైసలు వసూలు చేస్తున్నారు, అది ఇకనుండి 10.85పైసలు కానుంది. జిల్లాలో నెలకు 500 యూనిట్లు దాటే సర్వీసులు 2600 వరకు వున్నాయి. ఇవన్నీ పరిశ్రమలు, వాణిజ్య, వ్యాపార సంస్థల క్రిందకు వస్తాయి. ఈ లెక్కన చూస్తే గృహవినియోగదారుల సర్వీసులపై భారం పడనట్లే! కాకపోతే వచ్చేది ఎండాకాలం. ఏసిలు 24 గంటలు పనిచేసే కాలం. కాబట్టి గృహ వినియోగదారులు కూడా జాగ్రత్తగా వుండాలి. లేకుంటే మీటర్ పాటికి మీటర్ తిరుగుద్ది... ఆ తర్వాత వచ్చే కరెంట్ బిల్లు చూసి మన బుర్ర తిరుగుద్ది...!

## ఒక్క అవకాశమిస్తే...
# చేసేది ఇదా..?

### కోటంరెడ్డి శీనయ్య ఫైర్



ఒక్క అవకాశం ఇస్తే రాష్ట్రం రూపు రేఖలు మారుస్తానని చెప్పిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి, వచ్చిన అవకాశంతో ప్రజల బ్రతుకులు చిందర వందర చేస్తున్నాడని నుడా మాజీఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆరోపించాడు. తొలగించిన పింఛన్‌లు, రేషన్‌కార్డులను పునరుద్ధరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబుకు వినతిపత్రం సమర్పించాడు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఒక్క నెల్లూరు నగరంలోనే 10వేల పింఛన్‌లు తొలగించారని ఆరోపించాడు. జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులెదుర్కొంటున్నారని విమర్శించాడు. రాష్ట్రంలో రౌడీరాజ్యం నడుస్తోందని, ఎమ్మెల్యేలే దాదాల్లా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నాడు. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో 56లక్షల మందికి పింఛన్‌లు ఇచ్చారని, జగన్ వచ్చాక ఏడు లక్షల మందికి పాత పింఛన్‌లు రద్దు చేశాడని పేర్కొన్నాడు. టీడీపీ నాయకులు జెన్ని రమణయ్య, మామిడాల మధు, పొత్తూరు శైలజ, అంచూరు శ్రీనివాసులునాయుడు, పిట్టి సత్యనాగేశ్వరరావు, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్‌సికి వ్యతిరేకంగా
# టీడీపీ ర్యాలీ




సిఏఏ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ బిల్లులకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో 9వ తేదీ నెల్లూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండి మొదలైన ర్యాలీ విఆర్‌సి మీదుగా కలెక్టరేట్ వద్దకు చేరుకుంది. సిఏఏ, ఎన్ఆర్‌సి బిల్లులకు వ్యతిరేకంగా 38రోజులుగా ఇక్కడ రిలేదీక్ష చేస్తున్న వారికి టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నుడా మాజీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మైనార్టీసెల్
# జిల్లా అధ్యక్షుడిగా అల్లాఉద్దీన్



కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ నెల్లూరుజిల్లా అధ్యక్షుడిగా ఎస్.కె.బి చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఎస్.కె.అల్లాఉద్దీన్ సోమవారం బాధ్యతలు చేపట్టాడు. ఈ సందర్భంగా అల్లాఉద్దీన్ కాంగ్రెస్‌పార్టీ పురోభివృద్ధి కొరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని శపథం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్, టి.బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మీ పిల్లలు జాగ్రత్త!

## స్కూల్ వ్యాన్‌లంటేనే భయమేస్తోంది



**పులులు, సింహాలు, తోడేళ్లు వంటి క్రూరమృగాలు అడవుల్లోనే వుంటాయి, అవి ఆకలేస్తేనే ఇతర జంతువులను వేటాడుతాయి. వాటికి ఆహారం వేటాడి సంపాదించుకోవడమే... అది సృష్టి ధర్మం. ఇందులో వాటి తప్పేమీ లేదు. కాని, క్రూరమృగాలను మించిన కామాంధులు, కిరాతకులు జనారణ్యంలో ఎక్కువపట్టినా వుంటున్నారు. సాటి మనుషులనే వీళ్లు కాటేస్తుంటారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఒంటరిగా కనపడితే, ఇలాంటి వాళ్లు తమ కోరలు చాస్తుంటారు.**

ముఖ్యంగా తమ పిల్లలను వ్యాన్‌లలో స్కూళ్ళకు పంపించే తల్లిదండ్రులు కొంచెం జాగ్రత్తగా వుండాల్సిన తరుణమిది. స్కూల్ డ్రైవర్లుగా, అటెండర్లుగా ఎలాంటివాళ్ళుంటున్నారో, వాళ్ళ బుద్ధి ఎప్పుడు ఎలా మారుతుందో తెలియదు. ఇటీవల నెల్లూరు, మైపాడు రోడ్డులోని కిసాన్‌నగర్ ప్రాంతంలో జరిగిన ఓ సంఘటన తల్లిదండ్రులకు, అలాగే స్కూల్ యాజమాన్యాలకు కూడా ఓ హెచ్చరికలాంటిది. విద్యావిహార్ స్కూల్ వ్యాన్ డ్రైవర్ రోజూ తన వ్యాన్‌లో వచ్చే నాలుగో తరగతి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. స్థానికులు ఇది గమనించి అతడి గుద్దలూడదీసి దేహశుద్ధి చేసి నడిరోడ్డు మీద ఊరేగించి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన వల్ల స్కూల్ పరువు కూడా పోయింది.

గతంలోనూ రాష్ట్రంలో అక్కడక్కడా ఈ తరహా సంఘటనలు జరిగాయి. కాబట్టి స్కూళ్ళ యాజమాన్యాలు కూడా తమ వ్యాన్‌ల డ్రైవర్లు, అటెండర్లను నియమించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముత్తుకూరు వద్దగల నవయుగ ఇంటర్నేషనల్ స్కూల్ వాళ్ళు తమ వ్యాన్‌లకు అటెండర్‌లుగా మహిళలను నియమించారు. పిల్లలను వాళ్ళే దిగి ఎక్కించడం, దించడం చేస్తూ వారిపట్ల జాగ్రత్త తీసుకుంటున్నారు. కాబట్టి అన్ని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు కూడా ఈ విషయంపై దృష్టి పెట్టాలి.

## డివిజన్‌లో విభజనపై
# కోర్టుకెక్కిన ఉచ్చి

నెల్లూరు నగరపాలక సంస్థలో డివిజన్‌ల పునర్విభజనపై తెలుగుదేశానికి చెందిన మాజీకార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ హైకోర్టులో పిల్ వేశాడు. డివిజన్‌ల పునర్విభజనలో పారదర్శకత, నిబంధనలు పాటించలేదని, ఒక డివిజన్‌లో భారీగా ఓట్లుండగా, ఇంకో డివిజన్‌లో అతితక్కువగా వున్నాయని, పొట్టేపాళెం లేకుండా తయారు చేసిన పునర్విభజన మ్యాప్‌పై ఎవరి అభ్యంతరాలు తీసుకోలేదంటూ ఆయన ఆ పిల్‌లో పేర్కొన్నాడు.

# జడ్పీ జీవవైవిధ్య నిర్వహణ కమిటి

జిల్లా పరిషత్‌కు ప్రభుత్వ జీవవైవిధ్య నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు ఛైర్మెన్‌గా వ్యవహరిస్తారు. ఇక సభ్యులుగా ఏపిఎస్‌బిడిబి జిల్లా కో–ఆర్డినేటర్ వి.వెంకటేశ్వర్లు, బోటనీ విభాగానికి చెందిన డాక్టర్ పి.విక్టోరియారాణి, ఆయుర్వేద డాక్టర్ స్వర్ణకుమారి, ఫిషరీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.అనిల్‌కుమార్, ఆయుష్ వైద్యశాఖ డాక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, బాలజ్యోతి ఆర్గనైజేషన్‌కు చెందిన ఎస్.చంద్రశేఖర్‌లను నియమించారు. జీవవైవిధ్య సంరక్షణ, జీవ వనరుల ప్రయోజనాలు, వనరుల సుస్థిరత అంశాలపై ఈ కమిటీ పనిచేస్తుంది.

# అక్రమార్కులపై వేటు

భూ రికార్డుల నమోదులో అవకతవకలకు పాల్పడినందుకు ఏ.ఎస్.పేట తహశీల్దార్ శ్రీనివాసులు, చౌటభీమవరం విఆర్‌ఓ పి.శంకరయ్యలను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎస్‌పేట మండలం చౌటభీమవరం మజరా తిమ్మనాయుడుపల్లిలో భూ రికార్డులను మార్చి వెబ్‌ల్యాండ్‌లో అనర్హుల పేర్లు నమోదు చేసినందుకు వీరిపై చర్య తీసుకున్నారు. ఏఎస్‌పేట ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ బాధ్యతలను ఆత్మకూరు తహశీల్దార్‌కు అప్పగించారు.

## జయభారత్ హాస్పిటల్‌కు
# డయాలసిస్ పరికరం

నెల్లూరులోని జయభారత్ హాస్పిటల్‌కు రూ.4 లక్షలు విలువగల కిడ్నీ డయాలసిస్ పరికరాన్ని శ్రీ భగవాన్ మహవీర్ ట్రస్టు సభ్యులు సురేష్ జైన్ ఆసుపత్రి నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ సురేంద్రకుమార్ మాట్లాడుతూ కిడ్నీ బాధితులకు ఈ పరికరం ద్వారా వైద్యసేవలు అందించే వీలుకలుగుతుందన్నారు. దాత సురేష్ జైన్ మాట్లాడుతూ జయభారత్ ఆసుపత్రికి గతంలో డయాలసిస్ యూనిట్, ఐసీయుల్లో అనేక వైద్య పరికారాలు అందజేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందిస్తామన్నారు. ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్,సూపరింటెండెంట్ డాక్టర్ శివ మౌర్యగుప్తా, ప్రకాష్ జైన్, వాణి పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ పార్కు వాకర్స్ అసోసియేషన్
# కార్యవర్గం ఏర్పాటు

నెల్లూరు మాగుంటలేఅవుట్ లోని ఎన్టీఆర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈనెల9న పార్కులో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా నెల్లూరు మునిసిపల్ కమిషనర్ పీవీవీయస్ మూర్తి, మంత్రి ఓఎస్డీ సీహెచ్. పెంచలరెడ్డి పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా సుధాకర్ రాజు, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా రమేష్ కార్యవర్గ సభ్యులతో వాకర్స్ అసోసియేషన్ జిల్లా గవర్నర్ యస్.రాఘవేంద్రశెట్టి ప్రమాణం చేయించారు. డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ నలుబోలు బలరామయ్యనాయుడు, డిప్యూటి గవర్నర్లు యస్ మురళీమోహన్‌రావు, సుధాకర్‌రెడ్డి, వి.హజరత్‌బాబు, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ సెలవు

నెల్లూరు నగర తహశీల్దార్ ఈ నెల 21 దాకా సెలవులో కొనసాగనున్నారు. ఈమధ్య రెవెన్యూ క్రీడల పోటీలు సందర్భంగా ఆయన సరదాగా క్రికెట్ ఆడుతున్న సమయంలో క్రికెట్ బంతి చేతికి బలంగా తగిలి మణికట్టు వద్ద దెబ్బ తగిలింది. చెయ్యిని కదపలేని పరిస్థితి. దీంతో వైద్యుల సలహా మేరకు ఆయన 21 దాకా సెలవు పెట్టారు.

# 'ఇంటికే ఇసుక'ను సక్సెస్ చేద్దాం!

**- కలెక్టర్ శేషగిరిబాబు**



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇసుక డోర్‌డెలివరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు పిలుపునిచ్చారు. 10వ తేదీ ఆయన తన క్యాంప్ కార్యాలయంలో ఇసుక డోర్‌డెలివరీపై మైనింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రజలకు ఇసుక కొరత రానీయకుండా డోర్ డెలివరీ కార్యక్రమం సక్రమంగా జరిగేటట్లు చూడాలన్నారు. ఇసుక సరఫరాకు వాహనాలు అందుబాటులో వున్నాయో లేదో చూసుకోవాలని, అన్ని వాహనాలకు జీపీఎస్‌లు అమర్చారో లేదో పరిశీలించాలని, ఇసుక అక్రమ మార్గం పట్టకుండా కట్టడి చేయాలని సూచించారు. అలాగే ఆయన హౌసింగ్ కాలనీలకు గ్రావెల్ అవసరం దృష్ట్యా గ్రావెల్ లభ్యతపై దృష్టి పెట్టాలని కోరారు. మైనింగ్ ఏ.డి వెంకటేశ్వర్‌రెడ్డి, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మర్యాదతోనే మన్నన

**- ఎస్పీ భాస్కర్‌భూషణ్**



మహిళా పోలీసు అధికారులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, అప్పుడే పోలీసుశాఖ ప్రజల మన్ననలందుకుంటుందని జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ చెప్పారు. 10వ తేదీ నెల్లూరు, చెముడుగుంటలో వున్న జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో 5వ బ్యాచ్ వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల రెండువారాల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఇప్పటికే ఇక్కడ నాలుగు బ్యాచ్‌లకు శిక్షణనిచ్చామని, ఇక్కడ ఇచ్చిన శిక్షణకు రాష్ట్రంలోనే గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణా కేంద్రం డిఎస్పీ రవీంద్రరెడ్డి, ఆర్.ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### రెడ్‌క్రాస్‌లో...

# బియల్‌యస్, ఏసియల్‌యస్ శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ కార్యాలయంలో అమెరికన్ హార్ట్ అసోసియేషన్(ఏహెచ్‌ఏ) వారి ఆధ్వర్యంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ (బియల్‌యస్), అడ్వాన్సుడ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్(ఏసియల్‌యస్) రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి ఈనెల 8న ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆపద సమయాల్లో బియల్‌యస్, ఏసియల్‌యస్‌ను ఉపయోగించి ప్రాణాలను త్వరితంగా కాపాడవచ్చన్నారు. చెన్నై, కలకత్తా, బెంగళూరు, ముంబాయిలకే పరిమితమైన ఈ కోర్సులను అకాడమీ ఆఫ్ గ్లోబల్ ఎడ్యుకేషన్(ఏజిఇ) బెంగళూరు వారి సహకారంతో నెల్లూరులో ఏర్పాటు చేయడం సంతోషంగా వుందన్నారు. రెడ్‌క్రాస్ రీజినల్ కో-ఆర్డినేటర్ జి.వెంకటరవికుమార్, ఏహెచ్‌ఏ ఇన్‌స్ట్రక్టర్ అంజూమ్ ఇబ్రహీం, డా. స్మితీష్, రెడ్‌క్రాస్ సభ్యులు సిహెచ్ అజయ్‌బాబు, డా. సుధీర్, ఇయంయస్ ఇన్‌స్ట్రక్టర్ జి.పవన్ కుమార్, అపోలో హెచ్.ఒడి(ఎమర్జెన్సీ) డా.శ్రీనివాస్, డిఎఫ్ఒ. వేమనారాయణ పాల్గొన్నారు.

**రెడ్‌క్రాస్ సేవలు విస్తరిస్తాం..**

ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా శాఖ సేవలు విస్తరిస్తామని రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 10న రెడ్‌క్రాస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌కు అనుబంధంగా వున్న బ్లడ్‌బ్యాంక్, స్పాస్టిక్ సెంటర్, వాక్సినేషన్ సెంటర్, యూత్ రెడ్‌క్రాస్, క్యాన్సర్ ఆసుపత్రి, 21ఎకరాలలో గాంధీ ఆశ్రమం తదితరాలను ప్రజలకు సేవలందించేలా కమిటీ ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. గతంలో జరిగిన ఖర్చులపై ఆడిట్ నిర్వహించారని, అవసరమైతే దీనిపై ప్రత్యేకంగా తిరిగి ఆడిట్‌ను చేపడతామన్నారు. కమిటీ వైస్‌ఛైర్మన్ సుధీర్ నాయుడు, కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, సభ్యులు అయ్యా ప్రసాద్, అంకయ్య చౌదరి, రంగయ్య నాయుడు, రవిప్రకాష్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓ పక్క సంక్షేమ పథకాల వరద... ఇంకోపక్క పలు కారణాలతో రేషన్‌కార్డులు, పింఛన్‌లు కట్... సంక్షేమ పథకాలు గతంకంటే ఎక్కువయ్యాయని ఆనందపడేలోపే పలు నిబంధనల కారణంగా వస్తున్నవి కూడా వూడిపోవడం లబ్ధిదారులకు ఆగ్రహాన్ని మిగిల్చింది.

# కరెంటే కొంప ముంచిందా?

## పెద్దసంఖ్యలో రేషన్‌కార్డుల రద్దు వెనుక ప్రధాన కారణం అదేనా?

దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో అడిగినవాళ్ళకు అడిగినట్లు తెల్లరేషన్‌కార్డులు పంపిణీ చేశారు. అప్పట్లో తెల్లరేషన్ కార్డుదారులకు ఆరోగ్యశ్రీని వర్తింప చేయడంతో కోటీశ్వరులు కూడా తమ పలుకుబడితో తెల్లకార్డులు పొందారు. అప్పట్లోనే అసెంబ్లీలో ఆర్థిక మంత్రిగా వున్న రోశయ్య... రాష్ట్రంలో వున్న కుటుంబాలకంటే తెల్ల రేషన్ కార్డులు ఎక్కువగా వున్నాయని, మన అధికారులు పక్క రాష్ట్రాల వాళ్ళకు కూడా తెల్లకార్డులు ఇచ్చినట్లుగా వుందని వాపోవడం జరిగింది.

వైయస్ హయాంలో కార్డులు ఇబ్బడి ముబ్బడిగా ఇచ్చినా, ఆ తర్వాత వచ్చిన సీఎంలు కార్డుల జోలికి పోలేదు. వాటిని అలాగే కొనసాగించారు. కార్డులు తీసేస్తే ఎక్కడ ఓట్లు పోతాయోనని భయం.

కాని తొలిసారిగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కార్డుల ఏరివేతపై పెద్ద కసరత్తే చేసింది. అర్హులకు మాత్రమే పింఛన్‌లు, రేషన్‌కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందాలన్న సంకల్పంతో పకడ్బందీగా ఇంటింటి సర్వే నిర్వహించింది. వార్షికాదాయంతో పాటు 9 అంశాలను ప్రామాణికంగా తీసుకుని సర్వే జరిపారు. నాలుగు చక్రాల వాహనం కలిగి వుండడం, నెలకు 200 యూనిట్లకు మించి కరెంట్ వాడకం, 750 చదరపు అడుగులకు మించిన ఇల్లు ఉండడం, ఆదాయపన్ను పరిధిలో వుండడం, ప్రభుత్వ ఉద్యోగాలు కలిగి వుండడం, 5ఎకరాలకు మించి భూమి వంటివి ప్రామాణికంగా తీసుకుని తెల్లకార్డులకు కోత వేశారు. జిల్లాలో మొత్తం 9,04,230 కార్డులకు గాను సర్వే ద్వారా 1,49,039 కార్డులు ఎత్తేశారు. వీరికి ఫిబ్రవరి నుండి రేషన్ కూడా నిలిపేశారు.

**కరెంట్ బాధితులే ఎక్కువ**

కార్డుల ఏరివేతలో కరెంట్ వినియోగమే ప్రధాన పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఆఖరుకు రోజుకూలీకి వెళ్లేవారి ఇళ్లల్లో కూడా టీవీలు, ఫ్రిజ్‌లు, రెండు ఫ్యాన్‌లు, హీటర్లు వుంటున్నాయి. కొందరైతే ఎండాకాలంలో కూలర్లు, ఏసిలు కూడా వాడుతున్నారు. నెలకు 200 యూనిట్ల లోపు వాడకం అంటే సాధ్యమయ్యే పని కాదు. కరెంటు వినియోగం జీవితంలో ఒక భాగమైపోయింది. అలా కరెంట్ వాడిన దాని వల్లే ఇప్పుడు ఎక్కువమంది రేషన్‌కార్డులను కోల్పోవాల్సి వచ్చింది.

# పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



జ్యోతి ప్రజ్వలనతో అవగాహనా సదస్సును ప్రారంభిస్తున్న డా. బివిఆర్ మోహన్‌రెడ్డి, రామ్‌కుమార్

విద్యార్థులు పరిశోధనలకు మంచి ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా సమాజంలో సమున్నతమైన స్థానాన్ని సంపాదించుకోవాలని విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల మూడురోజులపాటు విద్యార్థుల అవగాహన కోసం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సెయింట్ కంపెనీ అధినేత పద్మశ్రీ డా.బివిఆర్ మోహన్‌రెడ్డి ఎంతో విశిష్టమైన వ్యక్తి అని, వారు ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి రావడం తనకెంతో సంతోషంగా ఉందని, అలాంటి వారి సూచనలు విద్యార్థులకు బాగా ఉపకరిస్తాయన్నారు.

డా. బివిఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు స్టార్టప్‌లకు డిజిటల్ టెక్నాలజీ ఎంతో అవసరమన్నారు. హైదరాబాద్‌లో హైటెక్‌సిటీకి రూపకల్పన చేసింది స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అని ఆయన అంటూ, అది ఆ తర్వాత సాంకేతిక పరిశ్రమలతో నూతన విప్లవాలను తీసుకొచ్చిందని, తద్వారా అనేక మందికి ఆర్థిక స్వావలంబన లభించిందని తెలిపారు. 50 ఏళ్ళ క్రితం కంప్యూటర్ ఒక పెద్ద ఇల్లంత ఉండేదని, ఇప్పుడు ప్రపంచమే అరచేతిలో ఇమిడిపోతున్నదంటే అందుకు కారణం సాంకేతిక రంగంలో వచ్చిన పెనుమార్పులేనన్నారు. డిజిటల్ టెక్నాలజీని వ్యవసాయ రంగంలోనూ, ఆటోమోటివ్ పరిశ్రమల రంగంలోనూ బాగా వినియోగిస్తున్నారన్నారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ అంతర్జాతీయ సదస్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐఐటి ఢిల్లీ ప్రొఫెసర్ బిఎంవి సుబ్బారావు, డా.జె.సూర్యనారాయణ, కార్యక్రమ ఆర్గనైజింగ్ సెక్రటరీ విక్రమ్‌కుమార్, ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేపట్టాలి

**- రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ హేమచంద్రారెడ్డి**

నేటి పోటీ ప్రపంచంలో మంచి ఉపాధి అవకాశాల కోసం ఇంజనీరింగ్ విద్యార్థులు దేశానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలను చేపట్టాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ హేమచంద్రారెడ్డి అన్నారు. ఈనెల 8వతేదీ జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రయోజనకరమైన పరిశోధనలను, ప్రాజెక్టులను విద్యార్థులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నై ఐఐటి ప్రొఫెసర్ రమేష్‌బాబు, ఐఐటి ప్రొఫెసర్ శివ శ్రీనివాసులు, బెంగుళూరులోని ఏరోనాటికల్ ఇంజనీర్ సుబ్బారెడ్డి, రత్న బయోటెక్స్ ఎం.డి గంగిరెడ్డి, కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, సదస్సు కార్యదర్శి విక్రమ్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి కిషోర్ పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



దివికేగిన సాహితీ దిగ్గజం

# మూగబోయిన 'వేదం'

## బహుభాషాకోవిదుడు.. వేదం వెంకట్రామన్ ఇక లేరు

*ప్రముఖ సాహితీవేత్త, నెల్లూరులోని విఆర్ కాలేజీ విశ్రాంత ఆంగ్ల అధ్యాపకులు వేదం వెంకట్రామన్ (90) ఈనెల 8వతేది కన్నుమూశారు. ఆయన మృతితో నెల్లూరులో ఒక సాహితీశిఖరం నేలకు ఒరిగిపోయినట్లయింది. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.*

మన నెల్లూరివారు అని సగర్వంగా చెప్పుకోదగ్గ ఉద్దండ పండితుడు, ప్రఖ్యాత నాటక కర్త, తొలి కళాప్రపూర్ణ బిరుదాంకితులైన వేదం వేంకటరాయశాస్త్రి మనుమలు వెంకట్రామన్‌గారు. తాతగారి వలె ఈ మనుమడు కూడా మంచి పండితులు. పలు భాషల్లో అమోఘమైన పాండిత్యం సంపాదించారు. తెలుగులోనే కాక ఆంగ్లం, సంస్కృతం, ఉర్దూ, తమిళం, ఫ్రెంచ్ భాషల్లో కూడా ఆయన ప్రావీణ్యం సంపాదించి సాహితీరంగంలో విఖ్యాతి చెందారు. విఆర్‌కాలేజీలో 38 సంవత్సరాల పాటు ఆంగ్లోపన్యాసకునిగా పనిచేశారాయన. భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వంటి ఎంతోమంది విద్యార్థిదశలో వారి వద్ద విద్యనభ్యసించారు. అంతేకాదు, నెల్లూరులోని వర్ధమాన సమాజం ఉపాధ్యక్షులుగా కూడా ఉంటూ ఎంతోమందికి వేదం వారు సాహితీ దిక్సూచిగా సేవలందించారు.

### ఉత్తమ గ్రంథం..'భానుని కాదంబరి' :

వేదం వెంకట్రామన్ రచించిన 'భానుని కాదంబరి– దాని వైశిష్ట్యము' అనే గ్రంథం ఆయనకెంతో పేరు తెచ్చింది. 1980లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు నిర్వహించిన పోటీల్లో ఈ గ్రంథం ఉత్తమగ్రంథంగా ఎంపిక కావడం ఆయన సారస్వత ప్రతిభాపాటవాలకు నిదర్శనం. అంతేకాదు, సంస్కృత భాషా పదాల పుట్టుకపై కూడా ఆయన అనేక పరిశోధనలు చేసి, ఎందరో పరిశోధక విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. భాషకు సంబంధించి, సాహిత్య రంగానికి సంబంధించి ఎవరికి ఏ సందేహాలు వచ్చినా తడుముకోకుండా తీర్చేవారు. ప్రముఖ చారిత్రిక పరిశోధకుడు, సాహితీవేత్త దివంగత నేలనూతల శ్రీకృష్ణమూర్తి (ఎన్నెస్కే) సూచనలతో ఆయన ఎన్నో చరిత్ర, సాహితీ అంశాలపై పరిశోధనలు చేసి మరింత ప్రఖ్యాతిగాంచారు. ఎన్నెస్కే దివంగతులయ్యాక, ఎన్నెస్కే పేరుతో ప్రతి ఏటా నెల్లూరులో ఎన్నెస్కే స్మారక ఉపన్యాస కార్యక్రమం ఏర్పాటుచేసేందుకు శాశ్వతనిధిని సమకూర్చడమేకాక ఆ కార్యక్రమాలు జయప్రదంగా జరిగేందుకు వారందించిన సహాయ సహకారాలు ఎనలేనివి.

### నిగర్వి.. నిరాడంబరుడు..

'వేదం' వారు తానెంత గొప్ప పండితుడైనా నిగర్వి.. నిరాడంబరుడు. ఎప్పుడూ తనకిష్టమైన కోటు వేసుకుని సాయంత్రమైతే చాలు నెల్లూరు ట్రంకురోడ్డు సెంటర్‌లో ఓ దుకాణం ముందున్న మెట్లమీద కూర్చుని, కనీసం ఓ గంట పాటైనా తన స్నేహితులు, సహచరులతో సంతోషంగా పిచ్చాపాటీ మాట్లాడుకోవడం, పక్కనే ఉన్న సీమా టీసెంటర్‌లోని టీ తాగి ఆనందించడం ఆయనకెంతో ఇష్టం. స్నేహితులంటే అపార గౌరవం. ముఖ్యంగా డాక్టర్ సివి సుబ్రహ్మణ్యం, రమణమూర్తి, డా.సుబ్రహ్మణ్యం తదితర మిత్రులతో ఆయన సాయం సమయాల్లో సత్కాలక్షేపం చేసేవారు. ఆ సమయంలో కూడా ఆయన నెల్లూరుజిల్లాకు సంబంధించిన ఎన్నో సారస్వత విషయాలను అందరికీ చెప్పేవారు. ఆయన సున్నిత మనస్కులు..సునిశిత విమర్శకులు కూడా. ఎంతటి గొప్ప రచన తనవద్దకు వచ్చినా, దానిలో భాషాపరంగా ఎన్ని తప్పులున్నాయో లెక్కకట్టి మరీ చెప్పే అపార ప్రజ్ఞావంతులాయన. అంతేకాదు, 'తప్పులు దిద్దుకోవాలయ్యా'.. అంటూ సున్నితంగానే చెప్పే పెద్దయ్యవారాయన.




ట్రంకురోడ్డులోని ఓ దుకాణం మెట్లపై మిత్రులతో, శిష్యులతో కాలక్షేపం చేస్తున్న వేదం వెంకట్రామన్

నెల్లూరు టౌన్‌హాలులో ఏ సాహితీ కార్యక్రమం జరిగినా, అది చిన్నపాటి కార్యక్రమమే అయినా సరే.. మొదటి రెండు వరుసల్లో ఎక్కడో ఒకచోట 'వేదం' వారు కనిపించడం తప్పనిసరి. అంతటి సాహిత్యాభిమాని 'వేదం' వారు. దివంగత సాహితీవేత్త కళాప్రపూర్ణ మరుపూరు కోదండరామరెడ్డికి, 'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులైన తుంగా రాజగోపాలరెడ్డికి ఆయన అత్యంత సన్నిహితులు. ఇక..పుస్తకాలంటే ఆయనకు ఎక్కడలేని ప్రీతి. తనకు వంశపారంపర్యంగా వచ్చిన అపూర్వమైన..అమూల్యమైన..ప్రాచీనకాలం నాటి గ్రంథాలను, ఇంకా అనేక పుస్తకాలను తన తర్వాతి తరానికి అందించాలనే సంకల్పంతో పూణేలోని బండార్కర్ లైబ్రరీకి, టిటిడి లైబ్రరీకి, తిరుపతిలోని సంస్కృత విద్యాపీఠానికి అందజేశారు. ఆయా గ్రంథాలు కనుమరుగు కాకుండా పరిరక్షించడం ఆయన గొప్పదనానికి, పుస్తకాలపై ఆయనకున్న అపారమైన అభిమానానికి నిదర్శనం. పుస్తక పఠనమంటే ఆయనకు ప్రాణం. పుస్తకాలను ఎల్లవేళలా చదువుతూనే ఉండేవారాయన. చివరి క్షణం దాకా పుస్తకాలు చదువుతూనే ఆయన శాశ్వతంగా కనుమూశారు. వారి మృతి ఎంతో బాధాకరం. సింహపురి సీమకు ఆయన లేని లోటు తీరనిది.

ఆయన మృతితో ఆయన కుటుంబసభ్యులతో పాటు సహచరులు, విఆర్ కళాశాల పూర్వ అధ్యాపకులు, మరెందరో సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, విద్యార్థులు ఆవేదనకు గురయ్యారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలియజేసి, ఆయనకు కడసారి కన్నీటి నివాళులర్పించారు. తెలుగుభాషకు, సాహితీరంగానికి ఎనలేని సేవలందించిన గొప్ప నిరాడంబర సారస్వతయోధుడు.. అందరికీ ఆత్మీయుడైన ఆ మహాపండితునికి 'లాయర్' నివాళులు.

## గూడూరు డివిజన్ వార్తలు

### పిఆర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి




మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రాష్ట్రంలోని పంచాయతీరాజ్ డిప్లొమో ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్‌అహ్మద్ తెలిపాడు. ఇటీవల విజయవాడలోని ఎన్జీఓ హోంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆ సంఘ గౌరవాధ్యక్షుడిగా తనను ఎంపిక చేసినట్లు తెలియజేశాడు. ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని కూడా ఎంపిక చేశామన్నాడు. ఎంపికైన నూతన కార్యవర్గం పిఆర్ ఉద్యోగుల సమస్యలపై పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పాడు. పలువురు నూతన సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశాడు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు హనుమంతరావు, రవింద్రకుమార్, పరమేశ్వరలింగం, కేశవులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### రోటరీ హెల్పేజ్ ఆధ్వర్యంలో వృద్ధులకు పలసరుకుల పంపిణీ



ఫలసరుకులు అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

గూడూరు పట్టణంలోని రోటరీ క్లబ్ భవనంలో రోటరీ హెల్పేజ్ ఆధ్వర్యంలో వృద్ధులకు పలసరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేయడం అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి నెల క్రమం తప్పకుండా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఫలసరుకులు అందజేస్తున్నట్లు చెప్పారు. క్లబ్ తరఫున సేవలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వెంకటేశ్వర్లురెడ్డి, దశరథరామిరెడ్డి, మయూరి శ్యాంయాదవ్, హరిప్రసాద్, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ కృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థినుల పుట్టినరోజు వేడుకలు



విద్యార్థినులకు కేక్ అందజేస్తున్న శ్యామ్‌యాదవ్

గూడూరు పట్టణ సమీపంలోని మినీ గురుకులంలో శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థినుల పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు బండి శ్యామ్‌యాదవ్ దాతృత్వంతో భారీ కేక్ కట్ చేసి విద్యార్థినులకు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైనదన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, గూడూరు పట్టణంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ప్రతినిధులు వనమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.




నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

### ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లు యధావిధిగా కొనసాగాలి

- పుట్టా శంకరయ్య

గూడూరు పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి వద్ద సిపిఎం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లపై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు పుట్టా శంకరయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను కొనసాగించాలని కోరారు. పార్లమెంట్ జోక్యం చేసుకుని రిజర్వేషన్లు యధావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సిఐటియు నాయకులు మణి, శంకరయ్య, శివకుమార్, ప్రసాద్, శ్రీనివాసులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### విఎస్‌ఆర్ 11వ వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులందజేస్తున్న సి.ఐ దశరథరామారావు

గూడూరు 2వ పట్టణ పరిధిలోని విఎస్‌ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఈ నెల 8వ తేదీ నిర్వహించిన వార్షికోత్సవానికి గూడూరు పట్టణ సిఐ దశరథరామారావు ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలలు నిర్వహించే వార్షికోత్సవాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం... ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు ఉండటంతో విద్యార్థులు సంతోషంగా ఉంటారని ఆయన చెప్పారు. గూడూరు మున్సిపల్ కమిషనర్ వై.ఓబులేసు మాట్లాడుతూ విఎస్‌ఆర్ పాఠశాలలో 11వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మల్లు విజయ కుమార్‌రెడ్డి, విఎస్‌ఆర్ పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణంరాజు, కరస్పాండెంట్ అన్నపూర్ణ, సంజయ్, రాజా, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు బి.శ్రీకాంత్‌రెడ్డి, చంద్రమోహన్, కె.ఆర్.రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శాంతకుమార్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### బాలసదన్‌కు వాషింగ్‌మిషన్



వాషింగ్ మిషన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

గూడూరు రెండోపట్టణం నరసింగరావుపేటలోని బాలసదన్‌కు కందలి కాలేషా జ్ఞాపకార్థం వారి కుమారుడు సుభాన్ దాతృత్వంతో వాషింగ్‌మిషన్‌ని ఎమ్మెల్యే వరప్రసాద్ చేతుల మీదుగా అందజేశాడు. మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కోడూరు కల్పలత, వైకాపా నాయకులు కోడూరు మీరారెడ్డి, సూపరింటెండెంట్ పి.అరుణ, శిరీష, వైకాపా నాయకులు సతీష్‌రెడ్డి, రాజారెడ్డి, అంకయ్య, కిషోర్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ములుముడిలో
# ధాన్యం కొనుగోలు కేంద్రం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏసునాయుడు

నెల్లూరురూరల్ మండలం ములుమూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని 10వతేదీ నెల్లూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్ ఎంబేటి ఏసునాయుడు ప్రారంభించాడు. ఈ సందర్భంగా రైతులతో ఆయన ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ నీరజ, డిఆర్‌డిఏ అధికారి సరిత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్
# బకాయిలు విడుదల చేయాలి

ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈనెల 7న నెల్లూరు వీఆర్‌సీ సెంటర్ నుంచి పెద్ద పోస్టాఫీసు వరకు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి విద్యార్థులు పోస్టు కార్డులు రాసి పంపించారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మనోజ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు రూ.4500 కోట్ల బకాయిలు విడుదల చేయాలన్నారు. అధికారంలోకి రాకముందు నవరత్నాల పేరుతో హామీ ఇచ్చి, అధికారం చేపట్టి 8 నెలలు గడుస్తున్నా నేటికీ బకాయిలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. జిల్లా కన్వీనర్ రాజశేఖర్, జశ్వంత్, లక్ష్మణ్, జయంత్, సుధీర్, బాషా, యశ్వంత్, విష్ణు, వెంకటేష్ పాల్గొన్నారు.

## జీలపాటూరులో
# కేంద్రీయ విద్యాలయం

నెల్లూరు జిల్లా పెళ్ళకూరు మండలం జీలపాటూరులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. జీలపాటూరు గ్రామం సర్వే నెంబరు 4లోని 10 ఎకరాల భూమిలో నాయుడుపేట ఆర్డీవో సరోజిని, మాజీ ఎంపిపి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తహసీల్దారు మునిరాజ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కృష్ణబాబు, వీఆర్వో ఖలీల్, మండల సర్వేయర్ సుప్రజ ఈనెల 10న స్థల పరిశీలన చేశారు. తిరుపతి పార్లమెంట్ సభ్యులు బల్లి దుర్గాప్రసాదరావు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

మండలంలోని జీలపాటూరు, చిల్లకూరు, పెళ్ళకూరు, కొత్తూరు తదితర గ్రామాల్లోని స్థలాలను పరిశీలించిన ఆర్డీవో జీలపాటూరు కేంద్రీయ విద్యాలయానికి అనువుగా ఉంటుందని ప్రకటించారు. 2020-21 విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభించే అవకాశం ఉంది. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే అవకాశం కలుగుతుంది. ఈ కేంద్రీయ విద్యాలయం వస్తే పెళ్ళకూరు మండలంలోని విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది.

## నిబంధనలు పాటించకుంటే..
# చర్యలు తప్పవు!

**జిల్లా ఉప రవాణా కమిషనర్ సుబ్బారావు**

నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ సుబ్బారావు ఆదేశించారు. ఈనెల 10న నెల్లూరు రవాణా కార్యాలయంలో ఆర్టీవోలు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించి వాహనాలు నడిపేలా ఎంవీఐలు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీవోలు సుశీల, మల్లికార్జునరెడ్డి, ఎంవీఐలు, ఏవోలు పాల్గొన్నారు.

## అగ్రికల్చర్ సర్వీసెస్ సంఘానికి
# కొత్త కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖకు ఈనెల 8న కొత్త కార్యవర్గాన్ని ఎన్నిక చేసుకున్నారు. కార్యవర్గంలోని 18 పోస్టులకు 18 మందే నామినేషన్లు దాఖలు చేయడంతో వారందర్నీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షునిగా శ్రీధర్‌రావు, సహాయ అధ్యక్షునిగా షేక్ మహబూబ్‌బాషా, ఉపాధ్యక్షులుగా పి.బి శ్రీనివాసులు, షేక్ నిజాముద్దీన్, ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎస్‌వి దయాబాబు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వై.ఆదినారాయణ, టి.సుభాషిణి, సంయుక్త కార్యదర్శులుగా టి.విజయ కుమార్, ఎం.బాలాజీ, ఆర్.తిరుపతి, కోశాధికారిగా సిహెచ్ యోగేశ్వర్, జిల్లా ఇ.సి మెంబర్లుగా పి.గోపికృష్ణ, పి.రహీంబేగ్, ఎం.సుభాషిణి, ఎం.శ్రీనివాసులు, ఎ.రజని, సహాయ కోశాధికారిగా బండారుపల్లి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. నూతన కమిటీని జిల్లా ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్‌విఆర్‌సి శేఖర్‌రావు తదితరులు అభినందించారు. ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మన్నేపల్లి పెంచలరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

శ్రీను గల్పిక

# విశాఖలో కరోనా వైరస్

గుంటూరులోని తెలుగుదేశంపార్టీ కార్యాలయం... హైటెక్‌రత్న చంద్రబాబు నాయుడుతో పాటు ఎంపీలు గల్లా జయదేవ్, కేశినేని నాని, కె.రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మల రామానాయుడు, వెలగపూడి రామకృష్ణ, నందమూరి బాలకృష్ణ, పయ్యావుల కేశవ్, నాయకులు బోండ ఉమ, దేవినేని ఉమ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావు, పీతల సుజాత తదితరులున్నారు. చంద్రబాబు ముఖంలో టెన్షన్ కనిపిస్తోంది. అమరావతి రాజధానిని నిలుపుకోవడానికి మనం చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలమవుతున్నాయి. ఆ జగన్ దూకుడుకు మనం తట్టుకోలేక పోతున్నాం. మన సానుభూతిపరులైన అధికారులను సస్పెండ్ చేస్తున్నాడు, కేసులు పెడుతున్నాడు. మన బినామీలపైన ఏసిబి దాడులు చేయిస్తున్నాడు, ఇదే స్పీడ్‌తో వెళితే అమరావతి భూముల్లో కూడా ఇన్‌సైడర్ ట్రేడింగ్ అని చెప్పి మనల్ని అందరినీ బొక్కలో వేయించినా వేస్తాడు. అమరావతి రాజధానిని నిలుపు కోలేకపోతే మన అందరి బ్రతుకులు బెజవాడ బస్టాండ్ పాలైనట్లేనని చంద్రబాబు వాపోయాడు. అది విని గల్లా జయదేవ్... ఏం చేసేను సార్, అమరావతి రాజధానిపై పార్లమెంట్‌లో ఇంగ్లీష్ స్పీచ్ దంచి కొట్టాలనుకున్నాను, 'మిస్టర్ మోడీ' అని ఇంకోసారి పిలిచి మీ అందరి చేత చప్పట్లు కొట్టించుకోవాలనుకున్నాను, ఆ స్పీకర్ నేను లేచీ లేవగానే, నోరు విప్పి అమరావతి అనగానే ఫుల్లుగా నాకు చీవాట్లు పెట్టి కూర్చోమన్నాడు. అమరావతి రాజధాని విషయంలో మేం ఇంతకంటే పోరాడలేం, మూడు రాజధానుల విషయంలో కేంద్రానికి కూడా ఫుల్ క్లారిటీ వున్నట్లుందని చెప్పాడు. కేశినేని నాని వుండి... ఆ బీజేపీ ఎంపీ జివిఎల్ నరసింహారావు ఒకడు... మనకు కంట్లో నలుసు, చెప్పులో రాయిలాగా తయారయ్యాడు. జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానులలో ఒక రాజధానిని అతనికి రాసిస్తానని హామీ ఇచ్చినట్లున్నాడు. మేం అమరావతి రాజధానిపై కేంద్రాన్ని ఒప్పిస్తామని చెప్పినప్పుడల్లా, రాజధానితో కేంద్రానికి సంబంధం లేదని స్టేట్‌మెంట్లిస్తూ మన గాలి తీస్తున్నాడని వాపోయాడు. చంద్రబాబు వుండి ఏం రాజధాని పోరాటమో... దానిని కొనసాగించలేక నా తడారిపోతోంది. టెంట్లకు, బిరియానీలకు, మజ్జిగ ప్యాకెట్లకు ఖర్చు రోజూ తడిసి మోపెడవుతోంది. ఆ జగన్‌లో చూస్తే వన్‌పర్సెంట్ కూడా మార్పొచ్చేటట్లు లేదు. ఇక్కడ ఖర్చు చూస్తే రోజుకు 10 లక్షలవుతోంది. ఈ లెక్కన నాలుగేళ్ల పోరాటం చేయాల్సివస్తే హెరిటేజ్ ఆస్తులనే కాదు, ఇక్కడ మనం కొన్న భూములు అమ్మినా సరిపోవని పిస్తోందని బాధపడ్డాడు. పత్తిపాటి పుల్లారావు అందుకుని... అదేంటోగాని మన అమరావతి రైతులు చేస్తున్న పోరాటం ప్రభుత్వాలనే కాదు, ప్రజల్ని కూడా కదిలించలేకపోతోందన్నాడు. ఎందుకనిపిస్తుంది... అందరూ సినిమా షూటింగ్‌కు వెళ్లేవాళ్లమాదిరిగా కూర్చుంటే. అనే మాట అక్కడ వినిపించింది. అందరూ వెనక్కి తిరిగి చూశారు. అక్కడ జేసీ దివాకర్‌రెడ్డి వున్నాడు. అప్పుడే ఆయన అక్కడకు వచ్చాడు. ఏంటి నువ్వు నేడి అని చంద్రబాబు అన్నాడు. వెంటనే జేసి దివాకర్‌రెడ్డి కొన్ని ఫోటోలు చంద్రబాబు టేబుల్ మీద వేశాడు. వీళ్లల్లో ఒక్కరన్నా రైతులుగా వున్నారా, మగాళ్లు చూస్తే పట్టుపంచెలు లేదా సూటు కోటు, ఆడోళ్లు చూస్తే పట్టుచీరలు, తళతళమెరిసే నగలు, చేతుల్లో ఐఫోన్‌లు.. వీళ్ల ధర్నా చేసే చోట ఆడి, బెంజ్, ఫోర్డ్, బిఎండబ్ల్యూ కార్లు... ఇలాంటి ధర్నాలకు సానుభూతి ఎలా వస్తుందని ప్రశ్నించాడు. మరి సానుభూతి రావాలంటే ఏం చేయాలి అన్నా అని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అడిగాడు. వెంటనే జేసీ... రేయ్ కొండల్ అని కేకేశాడు. ఓ వ్యక్తి లోపలకు వచ్చాడు. అతనితోపాటు పెద్దపెద్ద మూటలు పది దాకా లోపలకు తోసుకొచ్చారు. ఏంటవి అని చంద్రబాబు అడిగాడు. పాత గుడ్డల మూటలు, మా తాడిపత్రిలో అడుక్కునే వాళ్లను బ్రతిమలాడుకుని థర్డ్ సేల్‌లో తెప్పించాను... అక్కడ ధర్నా చేస్తున్న వాళ్లందరి చేత ఈ గుడ్డలు తొడిగించి కూర్చోబెట్టండి.. మగవాళ్లకు బొక్కలు పడ్డ బంగీలు, బనియన్‌లు, ఆడవాళ్లకు చిరుగుల చీరలు... ఇవి కట్టుకుని ధర్నాలో కూర్చున్నారంటే ప్రపంచంలో వున్న దరిద్రమంతా వీళ్ల ముఖాన్నే వున్నట్లుంటుంది... సీఎమ్మే కాదు, పీఎం అయినా వీళ్ల దీనస్థితిని చూసి గుండె కరిగి అమరావతిని రాజధానిగా వుంచాల్సిందే... అని సలహా ఇచ్చాడు. చంద్రబాబు ఆయన సలహా ప్రకారమే చేయడానికి పూనుకున్నాడు.

★★★★★

అమరావతి రాజధాని ఏరియాలోని మందడం. రైతులు ధర్నాలో కూర్చుని వున్నారు. అందరూ జేసీ తెచ్చిన చిరుగుడు బట్టలు ధరించి వున్నారు. 'ఏ టీవీ', 'చంద్రజ్యోతి', టీవీ 5x5 ఛానెల్స్ ఆ రైతుల చిరుగుల గుడ్డలు పదేపదే చూపిస్తూ, వారిపట్ల సానుభూతి పెంచే కథనాలను లైవ్ ఇవ్వసాగాయి. అదే సమయంలో 'ఆత్మసాక్షి' రిపోర్టర్ వెటకారం వెంకటేష్, కెమెరా ఉమెన్ మంగతో అక్కడకు వచ్చారు. ఆత్మసాక్షి స్టూడియోలో సన్నాయి నొక్కుల సంతోష్ న్యూస్ రీడర్ పొజిషన్‌లో ఉన్నాడు. వాళ్ళు కూడా లైవ్ మొదలుపెట్టారు. వెంకటేష్... అక్కడ పరిస్థితి ఎలావుంది అని సన్నాయి నొక్కుల సంతోష్ అడిగాడు. వెంకటేష్ దానికి... 'సంతోష్, ఇక్కడ ధర్నాలో కూర్చున్న రైతులను చూస్తుంటే 'సీమ టపాకాయ్' సినిమా పార్ట్-2 చూస్తున్నట్లుగా వుంది. అల్లరి నరేష్ హీరోగా నటించిన 'సీమటపాకాయ్' సినిమాలో హీరో కుటుంబసభ్యులు పేదవాళ్లుగా నటించడానికి వాళ్ల ఇంట్లో పని మనుషుల బట్టలు తొడుక్కుంటారు.. వీళ్లు కూడా తాము పేద రైతులం అని పించుకోవడానికి అడుక్కునే వారి బట్టలను అరువు తెచ్చుకుని తొడుక్కున్నట్లుగా వుందంటూ.. కెమెరాఉమెన్ మంగతో వెటకారం వెంకటేష్' అని ముగించాడు. ఆ మాటలను దూరంగా వుండి వింటున్న చంద్రబాబు గతుక్కుమన్నాడు. కోపంగా జేసీ వైపు చూసి... సినిమా ట్రిక్కులు మాకు తెలియవా... అంటూ గుర్రుగా చూశాడు.

★★★★★

గుంటూరు టిడిపి కార్యాలయం. చంద్రబాబుతో పాటు నాయకులంతా వున్నారు. అయిపోయింది, అంతా అయిపోయింది... ఇక అమరావతిని రాజధానిగా నిలుపుకోవడం కష్టం.. అని చంద్రబాబు నిర్వేదంగా అన్నాడు. "ఏమైపోయింది.. అయిపోయిందనుకోవడం మరణం, అవుతుందనుకోవడం విజయం. ఆ విజయం నేను అందిస్తా.. నాతో వచ్చేదెవరు? నాతో తినేదెవరు?" అని బాహుబలిలో ప్రభాస్ లెవల్లో డైలాగ్‌లు వినిపించాయి. అందరూ ఆశ్చర్యంగా అటువైపు చూశారు. అక్కడ తెలుగు యువ కిషోరం లోకేష్ వున్నాడు. అమరావతి రాజధానిపై మీకింకా నమ్మకముందా అని దేవినేని ఉమామహేశ్వరరావు అడిగాడు. నమ్మకం కోల్పోయిన వాడు భీరుడు... నమ్మకంతో పోరాడేవాడు ధీరుడు... నాకింకా నమ్మకముంది అని లోకేష్ అన్నాడు. ఏంటా నమ్మకం అని పి.నారాయణ అడిగాడు. ఈ భూమ్మీద అత్యంత భయంకరమైన వైరస్ ఏంటి అని లోకేష్ అడిగాడు. 'కరోనా' అని బీద రవిచంద్ర సమాధానమిచ్చాడు. వెంటనే లోకేష్... దానికంటే భయంకరమైనది అని ప్రశ్నించాడు. అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకోసాగారు. అప్పుడు లోకేష్ వుండి... 'ఎల్లో మీడియా'... దీనిని మించిన వైరస్ మన రాష్ట్రంలో లేదు, అటు కరోనా... ఇటు ఎల్లో మీడియా... ఈ రెండు వైరస్‌లను బేస్ చేసుకునే అమరావతిని నిలబెట్టబోతున్నాను అని చెప్పాడు. లోకేష్ ఆత్మవిశ్వాసానికి చంద్రబాబు ఆశ్చర్యపోతూ.. ఎలా? అని అడిగాడు. విశాఖలో కరోనా వైరస్ విస్తృతంగా వుందని మన ఎల్లో మీడియా వైరస్ ద్వారా ప్రచారం చేయిస్తాను, ఆ దెబ్బకు ఎవరూ విశాఖకు పోరు... చచ్చినట్లు అమరావతిలోనే రాజధానిని కొనసాగిస్తారు అని లోకేష్ సమాధానమిచ్చాడు. అది విన్న జేసీ... కొంపలు కట్టడం కష్టమేగాని కూల్చడం చాలా తేలిక సార్... బాబుకు అన్నీ మీ తెలివితేటలే అంటూ మెచ్చుకున్నాడు.

# రాజరాజేశ్వరి దేవస్థానంలో.. నేత్రపర్వంగా కుంభాభిషేకం

నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 5 నుండి 7 వ తేదీ వరకు కుంభాభిషేకాలు నేత్రపర్వంగా జరిగాయి. చివరిరోజు 7వతేది శుక్రవారం కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి స్వహస్తాలతో కుంభాభిషేకం నిర్వహించారు. అమ్మవారి ఆలయ విమాన గోపురాన నూతన కలశ ప్రతిష్ట, గాయత్రీ దేవి బింబ ప్రతిష్ట జరిపి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. సుందరేశ్వర స్వామి, గాయత్రీదేవీ ఆలయాల శిఖరాలు, యజ్ఞశాల శిఖరం, రాజగోపుర శిఖరాలకు కుంభాభిషేకం నిర్వహిం చారు. రాజ్యసభ సభ్యుడు కుంభాభిషేక దాతలు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు కలశారాధన, విశేషపూజలు జరిపారు. ఆలయానికి విచ్చేసిన పీఠాధిపతికి అర్చకులు, ప్రముఖులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదపండితుడు బాదంపూడి ఫణిశర్మ అవధాని ఆధ్వర్యంలో యజ్ఞశాల ప్రదక్షిణ, గర్తన్యాసం, ధాతున్యాసం, నవరత్న స్థాపన, ద్రవ్య, నిక్షేపణ విగ్రహాలకు జీవన్యాసం, కళాన్యాసం, మహాపూర్ణాహుతి తదితర విశేష క్రతువులను రుత్వికులు నిర్వహించారు. అనంతరం శాంతి కల్యాణం కనులపండువగా జరిగింది. భక్తులకు అన్నదానం చేసారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఆలయ ఛైర్మన్ రత్నం జయరాం, ఇఒ శ్రీనివాసరెడ్డి, ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.



కుంభాభిషేకం చేస్తున్న కంచి పీఠాధిపతి శ్రీ విజేయంద్ర సరస్వతి, పక్కన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతి దంపతులు

# దీన్‌దయాళ్ మార్గం అందరికీ ఆదర్శం

**- బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ**

దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు పండిత్ దీనదయాళ్ అని, ఆయన స్ఫూర్తి అందరికీ మార్గదర్శకం కావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. ఈనెల11న దీనదయాళ్ వర్ధంతి సందర్భంగా నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జనసంఘ్ వ్యవస్థాపకులైన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, శ్యాంప్రసాద్‌ముఖర్జీలు దేశం కోసం చేసిన సేవలు అపూర్వమని కొని యాడారు. ఈ సందర్భంగా బిజెపి నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన భరత్‌కుమార్ యాదవ్ అభినందన సభను స్థానిక కస్తూరిదేవి గార్డెన్స్‌లో నిర్వహించారు. దేశంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు బిజెపి, ప్రధాని మోడీ నిరంతరం కృషిచేస్తున్నారని అన్నారు. బిజెపిని మరింత పటిష్టవంతం చేయాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కృషిచేయాలని ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. అనంతరం భరత్‌కుమార్‌ను గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో



ఊటుకూరు గ్రామానికి చెందిన కనపర్తి నాగేంద్ర ఆధ్వర్యంలో సుమారు వందమంది బిజెపిలో చేరారు. తొలుత బిజెపి కార్యకర్తలు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కరణం భాస్కర్, మిడతల రమేష్, కందుకూరు సత్యనారాయణ, ఈశ్వరయ్య, విజయలక్ష్మి, దయాకర్ రెడ్డి, విల్సన్, మస్తానయ్యగౌడ్, యశ్వంత్‌సింగ్ పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్యం సాకారం

(మొదటి పేజీ తరువాయి)

వుండేవాళ్ళకైతే కోటి నుండి 2 కోట్ల దాకా ఖర్చు. ఇక మున్సిపల్ ఛైర్మెన్ మేయర్ అభ్యర్థులంటే 5 నుండి 10కోట్ల దాకా ఖర్చు పెట్టుకోవాలి... ఒక కార్పొరేటర్‌కే కోటి రూపాయల ఖర్చవుతున్న కాలమిది. స్థానిక ఎన్నికలంటేనే గ్రామాలలో పగలు, ప్రతీకారాలు... గెలవాలనే పట్టుదలతో డబ్బును వెదజల్లుతారు, మద్యాన్ని ఏరుల్లా పారిస్తారు... ఇలా డబ్బు, మద్యంతో ఎన్నికలలో గెలిచిన వాళ్ళ పరిస్థితి ఎలా వుంటుంది... పదవిలో కూర్చున్నరోజు నుండి పెట్టిన పెట్టుబడికి పదింతలు ఎలా సంపాదించాలన్నదానిపైనే దృష్టి పెడతారు. గ్రామాలలో జరిగే పనుల్లో అవినీతే ఎక్కువగా వుంటుంది... గ్రామాభివృద్ధి కుంటుపడుతుంది.

ఈ దుష్ట సంస్కృతికి తెరదించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది. నామినేషన్‌ల నుండి ఫలితాల వెల్లడి వరకు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ 15రోజుల్లో, జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలు వారం రోజుల్లో, పంచాయితీ ఎన్నికలు ఐదు రోజుల్లో ముగిసిపోవాలి. దీనిద్వారా ఎన్నికల్లో డబ్బు, మద్యం నియంత్రణకు అవకాశముంటుంది.

### అతిక్రమిస్తే వేటే!

నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల్లో డబ్బు ఖర్చుపెట్టినా, మద్యంతో ప్రలోభపెట్టినా అభ్యర్థులపై అనర్హత వేటు వేయడమే కాదు, 3ఏళ్ల జైలుశిక్ష, 10వేల జరిమానా విధిస్తారు. ఎన్నికలలో గెలిచినా సదరు నాయకుడు ఇలాంటి తప్పుడు పనులు చేసాడని ఋజువైతే అప్పటికప్పుడు పదవిని కోల్పోవడమేకాదు, జైలు శిక్ష, జరిమానాలకు కూడా సిద్ధంగా వుండాలి.

### స్థానికులకే పెద్దపీట

సర్పంచ్, జడ్పీటీసీ అనే పదవులు గ్రామాలకు, మండలాలకు సేవ చేయాలన్న కోణంలో కాకుండా వాటిని ఒక హోదాగా చాలామంది నాయకులు భావిస్తున్నారు. ఒక జడ్పీటీసీ హైదరాబాద్‌లో వుంటాడు, ఇంకో సర్పంచ్ బెంగుళూరులో వ్యాపారం చేసుకుంటాడు. వీళ్ళు అప్పుడప్పుడు తమ గ్రామాలు, మండలాలకు వచ్చి పోతుంటారు. ఇక నుండి అవి కుదరవు. జడ్పీటీసీగా ఎన్నికైన వ్యక్తి తన మండల కేంద్రంలోనే నివాసముండాలి. సర్పంచ్ తన గ్రామాన్నే కనిపెట్టుకుని వుండాలి. అలా వుండలేమనుకుంటే పదవులు వదులుకోవాలి. అంతేకాదు గతంకంటే ఎక్కువగా సర్పంచ్‌లకు విశేష అధికారాలు కల్పించబోతున్నారు కూడా!

స్థానిక ఎన్నికల్లో ఒక్క ఓటు కొనకూడదు... ఒక క్వార్టర్ మద్యం ఇవ్వకూడదు... స్వచ్ఛంగా ఎన్నికలు జరగాలి. స్థానిక ఎన్నికల్లో డబ్బు, మద్యం నియంత్రిస్తే ఇదే సాంప్రదాయం అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలోనూ కొనసాగుతుందని, తద్వారా ప్రజాప్రతినిధులుగా మంచి వ్యక్తులు, నిజాయితీ పరులు వస్తారని జగన్ ఆలోచన, ఆశయం. ఇది ఆచరణ రూపం దాలిస్తే కుళ్లు పట్టిన రాజకీయాలను కడిగేయడానికి ఇంతకంటే పెద్ద ముందడుగు ఇంకోటి వుండదు.

### ఎలాంటి అంతరాయం లేకుండా

# బీయస్‌ఎన్‌యల్ సేవలు

నెల్లూరు జిల్లాలో భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీయస్ ఎన్ యల్) సేవలన్నీ యధాతథంగా ఎటువంటి అంతరాయం లేకుండా అందిస్తున్నామని జనరల్ మేనేజర్ ఐటీయస్ బి.చంద్రసేన తెలిపారు. ఈనెల 12న బిఎస్‌ఎన్‌ఎల్ జిల్లా ప్రధాన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల బీయస్‌ఎన్‌యల్ సంస్థ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ-2019 పథకం ద్వారా 237 మంది సిబ్బంది గతనెల 31న ఉద్యోగ విరమణ చేశారన్నారు. 50శాతం మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసినా కూడా సేవల్లో లోపం లేకుండా ఉండడానికి జిల్లాలో పర్యవేక్షక అధికారులు సరిపడా ఉన్నారన్నారు. బీయస్‌ఎన్‌యల్ సంస్థలో ఉన్న సిబ్బందితో వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా టెలికమ్ సేవలు అందిస్తున్నామన్నారు.

కొత్త ప్రీపెయిడ్ కనెక్షన్లకు ఎఫ్‌ఆర్‌సీ-108 అమల్లోకి వచ్చిందని, కాలపరిమితి 28 రోజులు ప్రతిరోజు 1 జీబీ డేటా, అపరిమిత కాల్స్ చేసుకోవచ్చన్నారు. ల్యాండ్‌లైన్ ఫాల్ట్ కంప్లైంట్ కొరకు 198 ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు.

# నాకు మీరు... మీకు నేను!

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత శివసేన వంటి పార్టీలు బీజేపీకి దూరం కావడం తెలిసిందే! ఈ నేపథ్యంలోనే బీజేపీ కొత్త మిత్రల అన్వేషణ మొదలుపెట్టింది. ఈ క్రమంలో వారికి చేరువవుతున్న పార్టీ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ.

ఈసారి ఎన్నికల నాటికి దక్షిణాది రాష్ట్రాలలోనూ సొంతంగా లేదా మిత్రపక్షాలతో కలిసి మెరుగైన స్థానాలు సంపాదించుకోవాలని బీజేపీ ఆలోచన. కర్నాటకలో అధికారంలో వుంది, తమిళనాడులో అన్నాడిఎంకెను కలుపుకోవడం, సూపర్‌స్టార్ రజనీకాంత్ మద్దతు తీసుకోవడంపై ప్లాన్ చేస్తోంది. తెలంగాణలోనూ వచ్చే ఎన్నికల నాటికి రెండో పార్టీగానైనా ఎదిగే అవకాశముంది. కేరళలో మాత్రం ఇప్పటికీ మూడో స్థానమే. ఆంధ్రప్రదేశ్‌లోనే పట్టు దొరకడం లేదు. ఇప్పటికే జనసేన అధినేత పవన్‌ను కలుపుకున్నారు. కాని, దీనివల్ల వాళ్ళకు పెద్దగా రాజకీయ ప్రయోజనం వుండదు. వైసిపితో పొత్తుతోనే ఏపిలో సీట్లు కలిసొస్తాయని వారి నమ్మకం. అందుకే చాలా రోజుల నుండి ఎన్డీఏలో చేరాలని జగన్‌ను వాళ్ళు ఆహ్వానిస్తూనే వున్నారు.

వైసిపి కూడా ఎన్డీఏలో చేరలేదనేగాని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరిస్తూనే వుంది. వాళ్ళు తెస్తున్న బిల్లులకు మద్దతు తెలుపుతూనే వుంది. అయితే వైసిపి ఎన్డీఏలో చేరాలంటే కేంద్రం కొన్ని డిమాండ్లను అమలు చేయాల్సివుంటుంది. వాటిలో రాష్ట్రానికి ప్రత్యేకహోదా ప్రధానమైనది. వీటితో పాటు విభజన హామీలు, అలాగే రాష్ట్రంలో ఇటీవల తీసుకున్న శాసనమండలి రద్దు, అభివృద్ధి వికేంద్రీకరణ బిల్లులు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు ప్రధాన పాత్ర పోషించనున్నాయి. ఈ నెల 12వ తేదీ ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీని కలిసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇవే విషయాలను ప్రధానంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది.

చంద్రబాబుకు జగన్‌కు నక్కకు నాగలోకానికి వున్నంత తేడా వుందని నరేంద్ర మోడీ ఎప్పుడో గ్రహించాడు. పూటకో మాట మార్చే రకం చంద్రబాబు అయితే, ఇచ్చిన మాట మీద నిలబడే రకం జగన్. ఈ దేశంలో సోనియాగాంధీని ఎదిరించి నిలబడ్డ మొనగాడు జగన్. అందుకే అతనితో స్నేహం చేయొచ్చని మోడీ ఉద్దేశ్యం! ఈ కోవలోనే వైసిపిని ఎన్డీఏలో చేర్చుకోవడానికి బీజేపీ అధిష్టానం తనవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

# దాడులతో దడదడ!

(మొదటి పేజీ తరువాయి)

చుక్కలు చూపిస్తున్నాడు. ఇటీవల చంద్రబాబు సీఎంగా వుండగా ఆయన పిఎస్‌గా పనిచేసిన శ్రీనివాస్‌తో పాటు లోకేష్ అంతరంగికుల ఇళ్ళపై ఏసిబి దాడులు నిర్వహించడం జరిగింది. ఈ దాడులలో చంద్రబాబు హయాంలో జరిగిన ఎన్నో అక్రమాలు వెలుగు చూస్తున్నట్లు సమాచారం. వారు అందిస్తున్న సమాచారం ఆధారంగా చంద్రబాబుకు ఉచ్చి బిగించే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్ల పాలనాకాలంలో కొందరు అధికారులు ప్రభుత్వ ఉద్యోగులుగా కాకుండా ఆ పార్టీ ఏజంట్లమన్నట్లుగా పనిచేశారు. అలాంటివారి భాగోతం పట్టే పని కూడా మొదలైంది. అలాంటివారి జాబితాలో మొదటి వ్యక్తి ఇంటలిజన్స్ మాజీ చీఫ్ ఏ.బి.వెంకటేశ్వరరావు. పోలీసుశాఖలో ఈయనకు ఖాకీ బట్టలు ధరించిన తెలుగుదేశం కార్యకర్త అన్న ముద్ర వుంది. ఏ మాత్రం అవకాశమిచ్చినా ఖాకీ బట్టలు బదులు పచ్చబట్టలు వేసుకుని డ్యూటీ చేస్తాడు. ఈయన పచ్చకామెర్ల జబ్బును గుర్తించే ఎన్నికల సమయంలోనే ఎన్నికల సంఘం ఆయనను పక్కన పెట్టేసింది.

ప్రభుత్వ సర్వీసులో వుండి ప్రజలకు సేవ చేయడానికి బదులు తెలుగుదేశంపార్టీ సేవలో తరించినందుకు ఆయనకు తగిన శాస్తే జరిగింది. ఇంటలిజెన్స్ ఐజిగా వున్నప్పుడు రక్షణ పరికరాల కొనుగోళ్లకు సంబంధించి చేసిన అవకతవకలకు గాను ఆయనను విధుల నుండి సస్పెండ్ చేయడమేకాక, ఏసిబి విచారణకు ఆదేశించారు. ఆయనపై దేశ ద్రోహం కేసు కూడా నమోదయ్యే అవకాశాలున్నాయి. తనపై సస్పెండ్ విధించిన నేపథ్యంలో ఏ.బి.వెంకటేశ్వరరావు తెలుగుదేశం వాళ్ళ మీదే ఆగ్రహంతో వున్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశంను నమ్మినందుకు తనకు అన్యాయం జరిగిందని ఆయన వాపోతున్నాడు. చంద్రబాబును నమ్మితే అన్యాయం కాక న్యాయం జరుగుతుందని ఈ పచ్చపోలీస్ ఆఫీసర్‌కు తెలియకపోవడం విచారకరం. అమరావతి రాజధాని ఆందోళనలతో జగన్‌ను ఇరుకున పెడతామని చంద్రబాబు ఆలోచిస్తే, జగన్ అందుకు విరుద్ధంగా ఎదురుదాడులతో ఆయనకే దడ పుట్టిస్తుండడం గమనార్హం.

# కల్యాణ వైభవం...!

## నిషిత - హనీష్




హైదరాబాద్‌లోని గాయత్రి ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత పి.వి.ఆర్.కె.మూర్తి - సంధ్యావాణిల కుమార్తె **నిషిత - హనీష్‌వర్ధన్** (విజయవాడ వాస్తవ్యులు సామినేని శ్రీధర్‌ప్రసాద్ - లక్ష్మీసవితల కుమారుడు)ల కల్యాణం ఫిబ్రవరి 12వ తేదీ హైదరాబాద్‌లోని ఓం కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## యశష్ - నిషిత



నెల్లూరు వాస్తవ్యులు కొండూరు రేవతీనాధ్ - అనితల కుమారుడు **యశష్ - నిషిత** (అదిలాబాద్ జిల్లా ఉట్నూరు గ్రామ వాస్తవ్యులు బాదావత్ రాజన్న - శకుంతలల కుమార్తె)ల వివాహం ఫిబ్రవరి 7వ తేదీ హైదరాబాద్‌లోని హిమగిరి గార్డెన్స్ ఫంక్షన్‌హాల్ నందు జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

## నవీన - హర్షవర్ధన్



ప్రముఖ మెజిషియన్ వీరంరెడ్డి శ్రీధర్‌రెడ్డి - భువనేశ్వరిల కుమార్తె **నవీన - హర్షవర్ధన్** (అంబూరు జయసింహ - గీతల కుమారుడు)ల పెళ్లి ఫిబ్రవరి 12వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

## సుజిత - అన్వేష్



నెల్లూరు వాస్తవ్యులు పెద్దిరెడ్డి శ్రీనివాసరెడ్డి - పద్మజల కుమార్తె **సుజిత - సత్యశివ అన్వేష్** (విశాఖపట్నం జిల్లా కూర్మన్నపాలెం వాస్తవ్యులు కొళ్ళపూడి వెంకటరమణారెడ్డి - ఉమల కుమారుడు)ల పరిణయం ఫిబ్రవరి 5వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

# నంబూరు ఇంట కంచి స్వామి..



'లాయర్' వారపత్రిక చదువుతున్న శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర శంకరాచార్య స్వామి

గత 12 రోజులుగా నెల్లూరు జిల్లాలో పర్యటిస్తూ పలు దేవాలయాలలో ప్రతిష్టలు కుంభాభిషే కాలు చేస్తూ జిల్లాకి ఆధ్యాత్మిక శోభ తెచ్చిన కంచి కామకోటి పీఠాధి పతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి శంకరా చార్య స్వామి వారు జిల్లాలో పర్యటనల భాగంగా ఫిబ్రవరి 9వతేదీ నెల్లూరులోని 'వాషింగ్టన్ హోమ్'లో ఉన్న నంబూరు లాబొరేటరీస్ అధినేత నంబూరు మోహనరావు ఇంటికి విచ్చేశారు. మోహనరావు, సులోచనమ్మ దంపతులు వారి కుటుంబ సన్నిహితులతో పాటు తిరుపతి నుండి స్వామివారి దర్శనార్ధం వచ్చిన సుమారు 200 మంది 'సంప్రదాయ' పాఠశాల బాలికలు స్వామి వారికి స్వాగతం పలికారు. మోహన్‌రావు ఇంట్లో ఉన్న 'లాయర్' వార పత్రికను చూసి, అందులోని 'ఆధ్యాత్మిక నగరి.. సింహపురి' అనే వార్తకు స్వామివారు ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల బాలికలు ఎంతో భక్తితో ఆలపించిన అన్నమయ్య కీర్తనలు అందరినీ అలరింపజేశాయి.



శ్రీ విజయేంద్ర స్వామి సమక్షంలో అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న 'సంప్రదాయ' పాఠశాల బాలికలు

# వైసిపిలో చేరిన భానుశ్రీ



మంత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ల సమక్షంలో వైసిపిలో చేరిన మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ

మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ ఎట్టకేలకు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో తన మొదటి రాజకీయ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టిన ఆమె, ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో సెకండ్ ఇన్నింగ్స్‌కు సిద్ధమ య్యారు. 13వ తేదీ గురువారం నెల్లూరు రూరల్ వైసిపి కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, మైనింగ్ విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ల సమక్షంలో ఆమె వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరడం జరి గింది. గతంలో ఆనం శిబిరంలో వున్న వారిలో ఈమె ముఖ్య నాయకురాలు. ఆనం శిబిరంలో వున్న నాయకులు చాలామంది క్రమక్రమంగా వైసిపిలో అందులోనూ అనిల్‌కుమార్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి శిబిరాలలో చేరారు. ఎవరు చేరినా భానుశ్రీ మాత్రం చేరదని చాలామంది అనుకున్నారు. రాజకీయాలైనా సరిపెట్టు కుంటుందిగాని, ఇటు వైపు రాదనుకున్నారు. రాజకీయాలలో ఐదేళ్ల విరామం తర్వాత ఆమె సెకండ్ ఇన్నింగ్స్‌ను ఆడడానికి సిద్ధమయ్యారు.

# శ్రీసిటీలో ఇసుజు అదనపు ఉత్పత్తి కేంద్రం




శ్రీసిటీలోని జపనీస్ యుటిలిటీ వాహన తయారీదారు 'ఇసుజు మోటార్స్ ఇండియా' తమ రెండవ దశ కార్యకలాపాలను ఈనెల 10న ప్రారంభించింది. కంపెనీ ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జపాన్ కాన్సులర్ జనరల్ కొజిరో యఛియామా, ఇసుజు మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ టోరు నకాటా, మిత్సుబిషి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, సిఇఓ ఇవారో టోయిడి, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని ఈ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ అదనపు ఉత్పత్తి కేంద్రంలో 400 కోట్ల పెట్టుబడితో ప్రెస్‌షాప్ సదుపాయం, ఇంజన్ అసెంబ్లీ యూనిట్‌ను ఏర్పాటుచేశారు. ఈ రెండవ దశ కార్యకలాపాల ప్రారంభం భారత్‌లో ఇసుజు కంపెనీకి అతిముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పంపిన సందేశాన్ని శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి తెలియజేస్తూ, ఇసుజుకు అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం మద్దతుకు భరోసా ఇస్తున్నామని, ఆటోమొబైల్ తయారీకి ఇసుజు ఒక ప్రామాణికంగా నిలుస్తుందని మంత్రి ఆ సందేశలో పేర్కొన్నట్లు తెలిపారు.



స్వర్గీయ బండి కృష్ణారెడ్డి గారు

మాజీ మండలాధ్యక్షులు, రాపూరు

1943 - 2019

# ప్రథమ వర్ధంతి

మానవత్వంలో మేలిముత్యం..
వ్యక్తిత్వంలో మహోన్నత శిఖరం..
మంచితనానికి నిలువెత్తు రూపం..
మా ఇంటి దైవం

## శ్రీ బండి కృష్ణారెడ్డి గారు

మాకు భౌతికంగా దూరమై ఏడాది గడవనుంది.
సదా వారి జ్ఞాపకాల నీడలో...
శ్రద్ధాంజలి ఘటిస్తూ...

భార్య - బండి పద్మావతమ్మ
మరియు కుటుంబసభ్యులు

**వారి ప్రథమ వర్ధంతి: తిథి ప్రకారం తేది 18-2-2020**
మంగళవారం, నెల్లూరు బి.వి.నగర్ మినీబైపాస్‌రోడ్డులోని
ANR కళ్యాణ మండపం నందు జరుగును.
కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.



డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి గారు

మాజీ శాసనసభ్యులు, ఆత్మకూరు

బి.ఎస్.ఆర్ హాస్పిటల్స్

# ఉత్తరక్రియలు

మమతల మణిదీపం, మా ఇంటి దైవం

## డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి గారు

తేది. 06.02.2020 గురువారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య
అరవిందమ్మ

కుమార్తె - అల్లుడు
మైథిలి - డా॥ దేవిరెడ్డి కార్తికేయ
U.S.A

కుమారులు - కోడళ్ళు
డా॥ బొమ్మిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి - డా॥ శ్వేత
డా॥ బొమ్మిరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి - సుప్రియ
U.K
బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, - కవిత
Ex. ZP Chairman, Nellore.

తమ్ముడు - మరదలు :
డా॥ తూమాటి రామకృష్ణారెడ్డి - దేవసేన
U.S.A

మనుమలు - మనుమరాళ్ళు
డా॥ హిమబిందు - డా॥ గిరి, మధు బిందు
డా॥ విజయ్ - డా॥ హారిత
తారక్ - గీతిక, డా॥ ప్రణవి - రాజేష్
డా॥ తేజస్విని, డా॥ లాలస
గహన్‌రెడ్డి, డా॥ వినతి

**పెద్దకర్మ : తేది 20-02-2020 గురువారం**
నెల్లూరుజిల్లా, ఆత్మకూరులోని మా స్వగృహము నందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com